ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు 5
ఆదివారం 17 నవంబరు 2024


తుంగభద్ర జలాశయం

నిబంధనలు తుంగలో..

వైసీపీ రంగు పూసుకున్న ఓ కాంట్రాక్టర్ అక్రమాలు కారణంగా దశాబ్దాలుగా కొనసాగుతున్న తుంగభద్ర ప్రాజెక్టు (టీబీపీ) బోర్డు అకౌంట్ ఫ్రీజ్ చేసే పరిస్థితికి వెళ్లింది. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో జరిగిన అవినీతి కారణంగా ఏకంగా బోర్డు ఆర్థిక కార్యకలాపాలు ఆగిపోయాయి. బోర్డులో పని చేస్తున్న దాదాపు 600 మంది ఉద్యోగులు, ఇంజనీర్లు, అవుట్ సోర్సింగ్ వర్కర్లు, పింఛన్‌దారులు రెండు నెలలుగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితి రావడానికి దారితీసిన కారణాలు ఏమిటి? కూపి లాగితే విస్తుగొలిపే వాస్తవాలు వెలుగు చూశాయి. బళ్లారిలో స్థిరపడిన ప్రకాశం జిల్లాకు చెందిన వైసీపీ రంగు పూసుకున్న ఓ కాంట్రాక్టర్ ప్రయోజనం, స్వలాభం కోసం 70 ఏళ్ల చరిత్ర కలిగిన టీబీపీ బోర్డు ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరించినట్లు తెలుస్తోంది. జీవో నంబరు.45కు విరుద్ధంగా టెండర్లు పిలవడమే కాకుండా ఏకంగా నిబంధనలు తుంగలో కలిపేశారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. వైసీపీ హయాంలో పని చేసిన ఓ ఈఎన్‌సీ, అదే సమయంలో బోర్డులో పని చేసిన ఓ ఉన్నత ఇంజనీరింగ్ అధికారి పాత్ర ఉన్నట్లు తెలుస్తోంది. సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ)తో విచారణ చేయిస్తే.. ఐదేళ్లలో టీబీపీ బోర్డులో జరిగిన అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

- జీవో నంబరు 45కు విరుద్ధంగా టెండర్లు
- 'వైసీపీ' కాంట్రాక్టర్ ప్రయోజనం కోసం..
- టీబీపీ బోర్డునే తప్పుదోవ పట్టించారు
- వైసీపీ హయాంలో ఇష్టారాజ్యం
- ఓ ఈఎన్‌సీ పాత్రపై అనుమానం


హొళగుంద మండలంలో చేసిన ఎల్లెల్సీ సీసీ లైనింగ్ పనులు (ఫైల్)

కర్నూలు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాయసీమ జీవనాడి తుంగభద్ర జలాశయం. కర్నూలు జిల్లాలో తుంగభద్ర దిగువ కాల్వ (ఎల్లెల్సీ) పరిధిలో ఖరీఫ్, రబీలో 1,51,413 ఎకరాలకు, అనంతపురం, కడవ జిల్లాల్లో టీబీపీ హెచ్చెల్సీ కాలువ కింద 2,84,992 ఎకరాలు, కేసీ కాలువ కింద ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాల్లో 2.65 లక్షల ఎకరాలకు సాగునీరు అందాల్సి ఉంది. తుంగభద్ర డ్యాం నుంచి ఏపీ వాటాగా 66.50 టీఎంసీలు కేడబ్ల్యూడీటీ-2 కేటాయించింది. ఏపీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల సాగు, తాగునీటి ప్రయోజనాల కోసం టీబీపీ బోర్డును 1953లో ఏర్పాటు చేశారు. తుంగభద్ర డ్యాం సహా ఎల్లెల్సీ కాలువ 0/0 నుంచి 241 కిలోమీటర్లు వరకు, హెచ్చెల్సీ కాలువ 0/0 నుంచి 135 కి.మీలు వరకు టీబీపీ బోర్డు పర్యవేక్షణలో ఉంది. బోర్డు పాలకవర్గంలో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఎస్ఈ స్థాయి అధికారి సెక్రెటరీగా, కేంద్ర ప్రభుత్వం ఆర్థిక శాఖ జాయింట్ సెక్రెటరీ హోదా కలిగిన ఐఏఎస్ అధికారి, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఈఎన్‌సీ హోదా అధికారులు సభ్యులుగా ఉంటారు. తుంగభద్ర డ్యాం, కాలువలు నిర్వహణ, మరమ్మతులు, ఆధునికీకరణ, ఉద్యోగుల జీతాలు కోసం ఏపీ ప్రభుత్వం 65 శాతం, కర్ణాటక ప్రభుత్వం 35 శాతం నిధులు సమకూరుస్తుంది. ముందుగా ఏపీ ప్రభుత్వం పూర్తిస్థాయి నిధులు కేటాయిస్తుంది. ఆ తరువాత కర్ణాటక ఇవ్వాల్సిన వాటా నిధులు సర్దుబాటు చేస్తుందని ఇంజనీర్లు అంటున్నారు. మూడు నెలలకు ఒకసారి జరిగే బోర్డు సమావేశంలో తీసుకునే నిర్ణయాలే అమలు చేయాలి. స్వయంప్రతిపత్తి కలిగిన తుంగభద్ర బోర్డును సైతం వైసీపీ అయాంలో ఒకరిద్దరు కాంట్రాక్టర్లు, వైసీపీ ముఖ్య నాయకులు, కొందరు ఇంజనీరింగ్ అధికారుల ధనాపేక్ష, స్వార్థప్రయోజనాల కోసం భ్రష్టుపట్టించారనే ఆరోపణలు లేకపోలేదు. వైసీపీ రంగు పూసుకున్న ఓ కాంట్రాక్టర్ అక్రమాలు వల్ల బోర్డు బోర్డు ఖాతా కార్యకలాపాలే ఆగిపోయాయంటే బోర్డులో రాజకీయ జోక్యం ఏ స్థాయిలో ఉందో ఇట్టే తెలుస్తుంది.

మిగతా 6లో..

టెండర్లలో మాయ చేసి దోచేశారు!

టీబీపీ బోర్డు నిర్వహణ, మరమ్మతులు, ఆధునికీకరణ పనుల కోసం ప్లానింగ్, నాన్ ప్లానింగ్ గ్రాంట్స్ రూపంలో ఏటేటా ఏపీ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులను కేటాయిస్తుంది. ఓటింగ్ చేసిన బడ్జెట్ కంటే ఒక్క రూపాయి కూడా అదనంగా టెండర్లు పిలవరాదని జీవో నంబరు.45 స్పష్టంగా చెబుతుందని, బోర్డు ఏర్పాటు నుంచి ఆ ఉత్తర్వులు మేరకు టెండర్లు పిలుస్తూ వచ్చారని ఓ ఇంజనీరు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిబంధనలు తుంగలో తొక్కారు. బడ్జెట్‌లో ఓటింగ్ గ్రాంట్‌కు విరుద్ధంగా కాలువల మోడర్నైజేషన్‌లో భాగంగా తొలి దశలో 2022 మార్చిలో ఎల్లెల్సీ సీసీ లైనింగ్ పనులకు రూ.519.80 కోట్లు, రెండవ దశలో 2023 జనవరిలో ఎల్లెల్సీ, హెచ్చెల్సీ కాలువల లైనింగ్ పనులకు రూ.400 కోట్లతో టెండర్లు పిలిచారు. ఏపీ ప్రభుత్వం గ్రాంట్ ఇవ్వకుండానే దాదాపు రూ.920 కోట్లకు టెండర్లు ఎలా పిలుస్తారు..? అనే ప్రశ్నలు వెల్లువెత్తాయి. అయితే వైసీపీ హయాంలో బోర్డు సభ్యుడుగా ఉన్న ఈఎన్‌సీ అధికారి ఒకరు ప్రభుత్వం నుంచి అడిషినల్ గ్రాంట్ మంజూరు చేయిస్తానని హామీ ఇవ్వడం, అదే అంశాన్ని ఏపీ బోర్డు మెంబరు అష్యూర్డ్ ఇవ్వడంతో అదనపు నిధులతో టెండర్లు పిలిచేందుకు బోర్డు సమావేశంలో తీర్మానం చేయించారని బోర్డు ఇంజనీరు ఒకరు తెలిపారు. కేవలం ధనాపేక్ష, స్వప్రయోజనాల కోసం ఎంతో తెలివిగా బోర్డునే తప్పుదోవ పట్టించి నిబంధనలు తుంగలో తొక్కారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. దీని వెనుక బళ్లారిలో స్థిరపడిన ప్రకాశం జిల్లాకు చెందిన వైసీపీ రంగు పూసుకున్న కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చడంతో పాటు గతంలో బోర్డులో పని చేసిన కొందరు ఇంజనీరింగ్ అధికారుల స్వార్థ ప్రయోజనాల కోసం తప్పుదోవ పట్టించారని తెలుస్తోంది.

సాంబార్ పాత్రలో పడి బాలుడి మృతి


జగదీష్ (ఫైల్)

గోనెగండ్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సాంబార్ పాత్రలో పడి ఓ బాలుడు శుక్రవారం మృతి చెందాడు. గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం పైపాడు గ్రామానికి చెందిన మంగళి వీరేష్ కుటుంబం గత కొన్నేళ్ల క్రితం జీవనోపాధి కోసం కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం వేముగోడు గ్రామానికి వచ్చింది. వీరేష్‌కు భార్య లక్ష్మీదేవి, ఒక కుమారుడు, ఇద్దరు కుతుళ్లు ఉన్నారు. వీరేష్ వేముగోడు గ్రామంలో బార్బర్ షాప్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. అయితే గురువారం గ్రామంలోని తమ బంధువుల ఇంట్లో శుభకార్యం జరుగుతుండగా భార్యా పిల్లలతో కలిసి వెళ్లాడు. వీరేష్ కుమారుడు జగదీష్(5) తన తండ్రి సెల్ ఫోన్‌లో గేమ్ ఆడుకుంటూ పక్కనే ఉన్న వంటలు చేసే గుడిసెలోకి వెళ్లాడు. సెల్‌ఫోన్ చూసుకుంటూ అప్పుడే వంట వండి దించిన వేడి వేడి సాంబార్ పాత్రపై కూర్చున్నాడు. పిల్లవాడి బరువుకు సాంబార్ పాత్రపై ఉన్న మూత జరిగిపోయింది. దీంతో జగదీష్ వేడి వేడి సాంబార్‌లో పడ్డాడు. వేడికి తాళలేక కేకలు వేయడంతో తల్లిదండ్రులు, బంధువులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా వైద్య చికిత్స చేశారు. శుక్రవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడితో మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

రీసర్వేపై కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు

- ముగిసిన రెవెన్యూ గ్రామ సభలు
- జిల్లాలో 18,600 ఫిర్యాదులు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ గ్రామ సభలు శనివారంతో ముగిశాయి. రెవెన్యూ గ్రామ సభల్లో రైతుల నుంచి దరఖాస్తులు కుప్పలతెప్పలుగా వచ్చాయి. గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన జగనన్న భూసర్వే లోపాల పుట్టగా మారింది. జగన్ బొమ్మలు ముద్రించిన సర్వే రాళ్లను పాతి పెట్టడంలో చూపిన శ్రద్ధ భూముల హద్దులు చూపడంలో.. హక్కులు కల్పించడంలో చూపలేకపోయారు. ఫలితంగా సాగు విస్తీర్ణం నుంచి పాస్ పుస్తకాల్లో ముద్రించే పేర్లు, ఆధార్, ఫోన్ నెంబర్ల వరకు అన్ని తప్పులతడకలుగా కనిపిస్తున్నాయి. వందేళ్ల నాటి భూ సమస్యలను పరిష్కరిస్తామని గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ ప్రభుత్వం భూ యజమానులకు కొత్త సమస్యలు తెచ్చిపెట్టింది. గత నెల 8వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలలో భూమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. దాదాపు 18,600 మంది రైతులు ఫిర్యాదులు చేయడం జగనన్న భూ సర్వే డొల్లతనాన్ని చాటి చెబుతోంది. జిల్లాలో మొదటి విడతలో 67 గ్రామాల్లోని 1,35,260 ఎకరాలు, రెండో విడతలో 21 గ్రామాల్లో 73,060 ఎకరాలు, మూడో విడతలో 164 గ్రామాల్లో 5,37,180 ఎకరాల్లో రీసర్వే చేశారు.

18 వేలకు పైగా దరఖాస్తులు

- ఆదోని డివిజన్‌లో ఆదోని 1058, పెద్దకడుమూరు మండలంలో 1566, మంత్రాలయం మండలంలో 1028, ఎమ్మిగనూరు మండలంలో 1080 దరఖాస్తులు వచ్చాయి.
- కర్నూలు డివిజన్‌లో కల్లూరు మండలంలో 1636, కోడుమూరు మండలంలో 911, ఓర్వకల్లు మండలంలో 820, సి.బెళగల్ మండలంలో 779, వెల్దుర్తి మండలంలో 776 మంది దరఖాస్తు చేసుకున్నారు.
- పత్తికొండ డివిజన్‌లో దేవనకొండ మండలంలో 912, తుగ్గలి మండలంలో 877, ఆలూరు మండలంలో 711, ఆస్పిరి మండలంలో 717 అత్యధిక దరఖాస్తులు వచ్చాయి. రీసర్వే జరిగిన ప్రతి గ్రామాల్లో సరాసరిగా దాదాపు 300 దరఖాస్తులు రావడం గమనార్హం.

రైతులు ఇచ్చిన దరఖాస్తుల్లో..

- ఆదోని డివిజన్‌లోని సరిహద్దుల్లో తేడాలు 61, జాయింట్ ఎల్‌పీఎం 1030, పొలం ఎక్కువ తక్కువ తేడాలు 4279, ఇతర సమస్యలు 338 ఉన్నాయి.
- కర్నూలు డివిజన్‌లోని సరిహద్దులో తేడాలు 41, జాయింట్ ఎల్‌పీఎం 1164, పొలం ఎక్కువ తక్కువ తేడాలు 2999, ఇతర సమస్యలు 219 ఉన్నాయి.
- పత్తికొండ డివిజన్‌లోని సరిహద్దులో తేడాలు 102, జాయింట్ ఎల్‌పీఎం 299, పొలం ఎక్కువ తక్కువ తేడాలు 3628, ఇతర సమస్యలు 72 దరఖాస్తులు వచ్చాయి.

ఇందులో మ్యుటేషన్‌కి సం బంధించి ఆధార్ నెంబరు, ఫోన్ నెంబర్ పేరులో తప్పు లు తదితర వాటిలో ఆదోని డివిజన్‌లో 177 2, కర్నూలు డివిజన్‌లో 1195, పత్తికొండ డివిజన్‌లో 1291 దరఖాస్తులు రెవెన్యూ గ్రీవెన్స్‌కు వచ్చాయి.



జిల్లా ప్రగతిపై కలెక్టర్ సమీక్ష

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలు తీర్చే విధంగా వంద రోజుల ప్రణాళికలు ఉండాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వంద రోజులు లక్ష్యాల పురోగతి, జిల్లా ప్రగతిపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వంద రోజుల ప్రణాళికలు మొక్కుబడిగా ఉండకూడదన్నారు. జనవరి-మార్చి వరకు రూపొందించే తదుపరి వంద రోజుల ప్రణాళిక లక్ష్యాలు నిర్దేశించుకోవాలన్నారు. నగర కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో నగరవనం, నగర వాటికల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహాల్లో కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో వెయ్యి ఎకరాల్లో గడ్డి పెంపకానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసిందన్నారు. 300 ఎకరాల్లో ఆయిల్ పామ్ లక్ష్యాన్ని త్వరితగతిన సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి
ఎస్పీ బిందుమాధవ్ 6

'బెల్టు' పెట్టుకోండి..!
ఆదోనిలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు 7

న్యాయ సంస్థల తరలింపు సరికాదు
వైసీపీ కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్షులు

వేరుశనగ, పత్తి ధరలు పతనం

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వేరుశనగ, పత్తి ధరలు శనివారం మరింత పతనమయ్యాయి. గతవారం ధరతో పోల్చితే క్వింటాకు పత్తి రూ.500, వేరుశనగ రూ.400 మేర ధర పతనమైంది. ఒక్కసారిగా ధరలు పడిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర కూడా మార్కెట్ కమిటీలో అందడం లేదన్నారు. 2,120 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా కనిష్ఠ ధర రూ.3,999, గరిష్ఠ ధర రూ.7,121, మధ్యస్థ ధర రూ.6,819 పలికాయి. వేరుశనగ 957 బస్తాలు విక్రయానికి రాగా కనిష్ఠ ధర రూ.3,435, గరిష్ఠ ధర రూ.6,929, మధ్యధర రూ.6,689గా పలికాయి.


విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఇంకెన్నాళ్లు..?



జిల్లా ట్రెజరీ కార్యాలయం

- 2019 సంవత్సరానికి సంబంధించి మూడు నెలల శాలరీ పెండింగ్

నంద్యాల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కాంట్రాక్టు అధ్యాపకులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు ఐదేళ్లవుతున్నా నేటికీ దక్కలేదు. అధికారులు చేసిన తప్పిదాలకు కాంట్రాక్ట్ అధ్యాపకులు వేతనాలను కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2019 ఏప్రిల్, మే, జూన్ నెలల పెండింగ్ రోజులకు సంబంధించి జీతాలు ఇచ్చే విషయంలో చిన్న పొరపాటు జరిగింది. దీనివల్ల ఉమ్మడి జిల్లాలో దాదాపు 12 మంది కాంట్రాక్టు అధ్యాపకులు ఒక్కొక్కరు దాదాపు రూ.62 వేలను కోల్పోయారు. ఈ మొత్తం పెండింగ్ రోజుల జీతాన్ని తమకు అందేలా చూడాలంటూ ఐదేళ్ల నుంచి వారు పోరాడుతూనే ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్ వేతనాలు అందించాలని కోరుతున్నారు. రాయలసీమ పరిధిలోని జోన్-4లో దాదాపు 296 మంది కాంట్రాక్ట్ అధ్యాపకులు ఉండగా, ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 90 మంది ఉన్నారు. ఆయా ప్రభుత్వ కళాశాలల్లో విద్యా బోధన చేసేందుకు కాంట్రాక్టు పద్ధతిన ప్రభుత్వం వీరిని నియమిస్తుంది. ప్రతి సంవత్సరం ఈ ప్రక్రియను చేపడుతూ మరుసటి సంవత్సరం వీరి కాంట్రాక్టును పునరుద్ధరిస్తూ ఉంటుంది. ఈ పద్ధతిలో కాంట్రాక్టు లెక్చరర్లకు 12 నెలల జీతం (10 రోజుల విరామంతో) జీతం చెల్లిస్తుంది. పది రోజులు విరామమిచ్చి మళ్లీ మరుసటి ఏడాదికి కాంట్రాక్టును పునరుద్ధరిస్తుంది. కానీ 2019 సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్, మే, జూన్ పెండింగ్ రోజులకు సంబంధించిన వేతనాలు కొంతమంది కాంట్రాక్టు అధ్యాపకులు దక్కించుకోగా, మరికొంతమందికి అందలేదు. వేతనాలు దక్కని కాంట్రాక్టు అధ్యాపకులు తమ పరిస్థితికి కారణమేమిటని ఆరా తీశారు. అప్పటి ప్రభుత్వం వెలువరించిన జీవోల్లో స్పష్టత లేకపోవటంతో జీతాలు చెల్లించలేదని సంబంధిత ట్రెజరీ అధికారులు చెప్పుకొచ్చారు.

స్పష్టత లేకపోవటంతో..

సాధారణంగా ప్రభుత్వ శాఖ అయినా, ప్రైవేటు కంపెనీ అయినా ఆ ఏడాది ఏప్రిల్ నుంచి మరుసటి ఏడాది మార్చి వరకు ఆర్థిక సంవత్సరాన్ని పాటిస్తాయి. అంటే ఒక ఆర్థిక సంవత్సరంలో రెండు సంవత్సరాల్లోని పన్నెండు నెలలు ఉంటాయి. ఉదాహరణకు గత ఏడాది ఆర్థిక సంవత్సరం అని ఎవరైనా పేర్కొన్నాలి వస్తే 2023-24 అని రాస్తారు. అంటే 2023వ సంవ్సరంలోని ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు ఉన్న 9 నెలలు, 2024వ సంవత్సరంలోని జనవరి, ఫిబ్రవరి, మార్చి వరకు మూడు నెలలను కలిసి 2023-24 ఆర్థిక సంవత్సరంగా పేర్కొంటారు. కానీ విద్యాశాఖలో ఆర్థిక సంవత్సరం అని కాకుండా విద్యా సంవత్సరం అని పేర్కొంటారు. దీని ప్రకారం విద్యా సంవత్సరం జూన్ నుంచి మొదలై మే నెలతో ముగుస్తుంది. కాంట్రాక్టు అధ్యాపకుల నియమకాలను విద్యాశాఖ ప్రాతిపాదికన సంబంధిత శాఖ చేపడుతుంది. కాంట్రాక్టు లెక్చరర్లకు సంబంధించి 12 నెలల జీతం (10 రోజుల విరామంతో) చెల్లించేలా 2019 సంవత్సరంలో ప్రభుత్వం జీవోఆర్టీ నెం:187, జీవోఎంస్ నంబరు 12ను విడుదల చేసింది. ఈ జీవోల్లో కాంట్రాక్టు లెక్చరర్లకు సంబంధించి జీతాలు చెల్లింపు విషయమై చిన్న పొరపాటు జరిగిందన్నది ట్రెజరీ అధికారుల వాదన. దీనివల్ల ఉమ్మడి జిల్లాలోని 12 మంది కాంట్రాక్టు లెక్చరర్లకు 2019 ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి పెండిగ్ రోజులకు జీతాలు అందలేదు.



మిగతా 6లో..

కోర్కెలు తీర్చే కొత్తూరు

- భక్తుల కొంగుబంగారంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి
- ఆదివారం మాంసం ముట్టని గ్రామం
- కార్తీక మాసంలో రద్దీ.. ● స్థలం కొరతతో ఇబ్బందులు

ఆలయం



స్వామివారి మూల విరాట్



ఆలయ గాలిగోపురం

పాణ్యం, నవంబరు16(ఆంధ్రజ్యోతి) : భక్తుల కొంగు బంగారమై కోరిన కోర్కెలు తీర్చే దైవంగా కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వెలుగొందుతున్నాడు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని కొలిచే భక్తులకు సంతాన ప్రాప్తి, సకల కోర్కెలు తీరుతాయన్న నమ్మకం. సుమారు 290 సంవత్సరాల క్రితం కొత్తూరు గ్రామానికి చెందిన బీరం చెన్నారెడ్డి అనే రైతు మాఘ శుద్ధ షష్టినాడు తన పొలంలో సేద్యం చేస్తుండగా నాగలికి స్వామి విగ్రహం తగిలి రైతుతోపాటు ఎద్దులు స్పృహతప్పి పడిపోయారని చెబుతారు. కొద్ది సేపటి తర్వాత స్పృహ నుంచి తేరుకున్న చెన్నారెడ్డి నాగలిని ఎత్తి చూడగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహం కనిపించిందని, దీంతో వెంటనే చెన్నారెడ్డి సమీప గ్రామంలోని పెద్దలను పిలుచుకొని మేళతాళాలతో వెళ్లి స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ జరిపినట్లు చారిత్రక ఆధారాలను బట్టి తెలుస్తోంది. నాటి నుంచి నేటి వరకు స్వామి భక్తుల నుంచి పూజలందుకుంటున్నారు. ఆలయంలో స్వామివారు ఎండకు, వానకు తడుస్తూ ఉండడం విశేషం. దేవాలయానికి ఎటువంటి మాన్యం లేకపోయినా భక్తుల విరాళాలు, సహకారంతో దినదినా భివృద్ధి చెందుతోందని ఆలయ ఈఓ రామకృష్ణ తెలిపారు.

కొత్త ఊరే కొత్తూరు : కొత్తూరు ఏర్పడక ముందు రెండు కిలో మీటర్ల దూరంలోని గగ్గటూరు బీరం వంశీకుల నివాసం. ప్రస్తుత కొత్తూరు ప్రాంతం వ్యవసాయ భూమి. స్వామి అవతరణతో గగ్గటూరు గ్రామానికి చెందిన కొన్ని కుటుంబాలు స్వామివారి చుట్టూ నివాసమేర్పరచుకొని జీవించేవారు. ఈ నివాసాలను కొత్తవూరుగా పిలవబడి రానురాను గ్రామం క్రమేపి కొత్తూరు సుబ్బరాయునిగా మారింది. గ్రామంలో అధిక శాతం మంది పేర్లు సుబ్బరాయునిగానే ఉండడం విశేషం. స్వామివారు ఆదివారం మాఘశుద్ధ షష్టి నాడు అవతరించడంతో కొత్తూరు గ్రామం ప్రజలు ఆదివారం మాంసాహారం ముట్టరు. ఆదివారం కనీసం గుడ్డు కూడా ముట్టకపోవడం ఈ గ్రామం ప్రత్యేకత.

కార్తీక మాసంలో భక్తుల రద్దీ

ప్రతి యేటా కార్తీక మాసంలో స్వామివారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకుంటారు. కార్తీక మాసం ఆదివారంలో దాదాపు 20 నుంచి 30 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకుంటారు. భక్తులకు ఆలయం ఆధ్వర్యంలో ప్రతి ఆది, మంగళవారాలు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు. ఆదివారం రాష్ట్ర నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుంటుంటారు.

వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు : కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ రామకృష్ణ తెలిపారు. స్వామివారి షష్టి సందర్భంగా వేకువజాము నుంచే రుద్రాభిషేకం, సహస్రనామార్చన, ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు, భద్రత ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే క్యూలైన్, దర్శనం నిర్వహణ తదితర కార్యక్రమాలు పూర్తి చేసినట్లు తెలిపారు.

దర్శనానికి వెళ్లాలంటే ఇబ్బందులు

ఆలయానికి అవసరమైన స్థలం లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే రూ. కోటి 20 లక్షల భక్తుల విరాళాలతో చేపట్టిన ఆలయ మహా ప్రకారం, క్యూలైన్ కాంప్లెక్స్ పనులు పూర్తికావచ్చాయి. అన్నదానం కార్యక్రమానికి సరైన సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నట్లు భక్తులు పేర్కొంటున్నారు. ఆలయ పరిధిలో ఇప్పటికే దాదాపు 70 గదులు, కళ్యాణ మండపం, కళ్యాణకట్ట, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వాహనాలు నిలపడానికి స్థలం లేక ప్రైవేటు స్థలంలో నిలపాల్సిన పరిస్థితి ఏర్పడింది.



తప్పు చేస్తే తప్పించుకోలేరు

తప్పు చేసిన వారు స్వామివారి నుంచి తప్పించుకోలేరు. ఆదివారం గ్రామంలో ప్రజలు ఎంతో నిష్ఠతో స్వామివారిని పూజిస్తారు. స్వామివారు అవతరించడంతోనే ఈ గ్రామం ఏర్పడింది. ప్రతి మంగళవారం రాహుకేతు పూజలు నిర్వహించి భక్తుల జీవితాల్లో వెలుగు నింపుతున్నాం.

- నాగపుల్లయ్య శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు



ఆలయం వద్ద భక్తుల రద్దీ

రాయపాటి శ్రీనివాస్‌కు ప్రశంసాపత్రం



కర్నూలు కల్చరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కర్నూలు లయన్స్ క్లబ్ ఆఫ్ మెల్విన్ జోన్స్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ బ్రెజిల్ దేశం నుంచి అంతర్జాతీయ స్థాయి ప్రశంసాపత్రం అందుకున్నారు. బ్రెజిల్ దేశంలోని ది లాస్ట్ ట్రంపెట్ మిషన్ థియలాజికల్ ఇన్‌స్టిట్యూట్, ఇంటర్నేషనల్ ఐటీఎంయూటీ యూనివర్సిటీ డైరెక్టర్ జార్జ్ జీసస్ శనివారం అంతర్జాలం ద్వారా ఈ ప్రశంసాపత్రాన్ని అందజేశారు. గత పది దశాబ్దాలుగా లయన్స్ క్లబ్, నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీల ద్వారా అందిస్తున్న వివిధ సామాజిక సేవా కార్యక్రమాలపై స్పందించి ఆ సంస్థ ఈ ప్రశంసాపత్రాన్ని ప్రకటించి అందజేసిందని డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రశంసాపత్రం మరింత స్ఫూర్తినిచ్చిందని, భవిష్యత్తులోనూ పేద వర్గాలకు సేవలు కొనసాగించేలా ప్రేరణ కల్పించిందని ఆయన తెలిపారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

గోదాములను తనిఖీ చేసిన సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొంగతి లక్ష్మీనారాయణ

కర్నూలు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం సరఫరాలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ కొంగతి లక్ష్మీనారాయణ హెచ్చరించారు. శనివారం నగరంలోని ఎ. క్యాంపులో ఉన్న ప్రజా పంపిణీ నిత్యావసర సరుకుల ఎంఎల్ఎస్ గోదాములను ఆయన తనిఖీ చేశారు. గోడౌన్ ఇన్‌చార్జి నాగమణితో వివరాలు తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. 2023 ఫిబ్రవరి నుంచి సీజ్ చేసిన 194 మెట్రిక్ టన్నుల బియ్యం రికార్డులు పరిశీలించి వీటిపై త్వరలో నిర్ణయం తీసుకోవాలని సూచించారు. గత వైసీపీ హయాంలో పేదల బియ్యం పంపిణీలో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని అన్నారు. కానీ తమ ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తోందని తెలియజేశారు.



సివిల్ సప్లయ్ గోదామును పరిశీలిస్తున్న కొంగతి లక్ష్మీనారాయణ

డీఎస్సీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటలక్ష్మమ్మ



మాట్లాడుతున్న సంక్షేమ శాఖ అధికారి బి.వెంకటలక్ష్మమ్మ

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించే ఉచిత డీఎస్సీ కోచింగ్ శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి పి.వెంకటలక్ష్మమ్మ అన్నారు. శనివారం స్థానిక అబ్బాస్ నగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్ భవనంలో ఉచిత డీఎస్సీ కోచింగ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుద్యోగులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ స్వర్ణయుగమన్నారు. ఈ శిక్షణ 60 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత స్టడీ మెటీరియల్‌తో పాటు శిక్షణకు హాజరైన అభ్యర్థులకు స్టయిఫండ్ మంజూరు చేస్తామని చెప్పారు. సెంటర్ గ్రంథాలయంలో పరీక్షలకు సంబంధించి పుస్తకాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా అభ్యర్థులకు స్థానికంగా వసతి కల్పిస్తామని తెలిపారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ అభ్యర్థులు సమయాన్ని వృథా చేయరాదన్నారు. నలుగురు,ఐదుగురు గ్రూపుగా ఏర్పడి ఒకరికొకరు చర్చించుకోవాలని సూచించారు. కో ఆర్డినేటర్ భాస్కర్, ఫ్యాకల్టీ, అభ్యర్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ

కర్నూలు క్రైం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండేలా విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని ఎస్పీ బిందుమాధవ్ అన్నారు. శనివారం జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాల, రవీంద్ర ఇంజనీరింగ్ కళాశాలల్లో విద్యార్థులతో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్లను స్మార్ట్‌గా వినియోగించుకోవాలని, ఇతర అవసరాలకు వాడితే జీవితాలు నాశనమవుతాయని అన్నారు. ఇంటర్‌నెట్ వాడకంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. యువత బ్యాంకు ఖాతాలకు స్ట్రాంగ్ పాస్‌వర్డ్ ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ బాబూ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్‌లు శ్రీనివాసమూర్తి, శ్రీనివాసరావు, సీఐలు ప్రసాద్, శ్రీధర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని ఎస్పీ బిందుమాధవ్ ఆదేశించారు. శనివారం నగరంలోని పలు ట్రాఫిక్ కూడళ్లను ఎస్పీ పరిశీలించారు. సీ క్యాంపు, నంద్యాల చెక్‌పోస్టు, గాయత్రి ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నళ్లు, సీసీ కెమెరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ నియంత్రించేందుకు చేపట్టాల్సిన ప్రణాళికలపై ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్‌కు పలు సూచనలు చేశారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఉపాధి కల్పన అధికారి పి. దీప్తి



సమావేశంలో మాట్లాడుతున్న పి.దీప్తి

కర్నూలు కల్చరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యావంతులైన యువత అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధికల్పన అధికారి పి. దీప్తి అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో కొనసాగుతున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమాలను ఆమె ప్రారంభించారు. ముందుగా గ్రంథాలయ ఉద్యమ నాయకుల చిత్ర పటాలకు పుష్పమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమాలు ఆనాడు విద్యావ్యవస్థ పురోభివృద్ధికి తోడ్పడ్డాయని, పాఠశాలలతో పాటూ గ్రంథాలయాలు విద్యావ్యాప్తిలో భాగస్వామ్యం అయ్యాయని చెప్పారు. విద్యార్థులు పుస్తకాలు చదవడం బాగా అలవాటు చేసుకోవాలని, మంచి పుస్తకాలు విజ్ఞానంతోపాటు సామాజిక వికాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కేసీ కల్కూర, విశ్రాంత భూగర్భ వనరుల ఇంజినీర్ ముచ్చుకోట చంద్రశేఖర్, చిత్రలేఖన అధ్యాపకుడు బీడీ సుధీర్‌రాజు, ఉప గ్రంథాలయ అధికారి వి. పెద్దక్క, గ్రంథాలయ అధికారులు వజ్రాల గోవిందరెడ్డి, ఎస్. బాషా, మక్బుల్ బాషా, గ్రంథాలయ ఉద్యోగులు చంద్రమ్మ, నసీమా, రేణుక, శ్రీనివాసులు, భాస్కర్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

- **ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు, చిత్రలేఖనం పోటీలు**

జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం సాయంత్రం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు పాఠకులను ఆకట్టుకున్నాయి. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సుమారు 200మంది పైగా విద్యార్థులు వివిధ పోటీలకు హాజరయ్యారు.

ఇంకెన్నాళ్లు..?

(5వ పేజి తరువాయి)

కళాశాల ఉన్నత విద్యకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 154 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్టు అధ్యాపకులు విద్యాబోధన చేస్తున్నారు. 2019-20 సంవత్సరానికి సంబంధించిన జీతాల చెల్లింపు విషయమై గందరగోళం కొనసాగుతున్న సమయంలోనే దాదాపు 90 కళాశాలల్లోని కాంట్రాక్టు లెక్చరర్లకు జీతాలు చెల్లింపులు జరిగిపోయాయి. మిగిలిన వారికి జీతాలు చెల్లించటంలో జిల్లా ట్రెజరీ అధికారులు ఉదాసీన వైఖరి ప్రదర్శించారు. ఇలా జీతాలు తీసుకోని ఉమ్మడి జిల్లా కాంట్రాక్టు లెక్చరర్లు విసిగిపోయి తమ పెండింగ్ జీతాలు చెల్లించాలంటూ డీటీఏ (డైరెక్టరేట్ ఆఫ్ ట్రెజరీ అండ్ అకౌంట్స్) శాఖకు మొర పెట్టుకున్నారు. అసలు విషయం ఏమిటి? ఎందుకు నంద్యాల ట్రెజరీ అధికారులు జీతాలు పెండింగ్‌లో పెట్టారు? అనే విషయంపై డీటీఏ అప్పట్లో ఆరా తీసింది. జీవోల్లో 2019-20 విద్యా సంవత్సరం అనేది, 2019 ఏప్రిల్, మే నెలలకు వర్తించదని, 2018-19 విద్యా సంవత్సరం అని ఉంటే జీతాలు చెల్లించటంలో ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదని, అయినా రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కువ శాతం మంది కాంట్రాక్టు లెక్చరర్లకు జీతాలు చెల్లించారు కాబట్టి, మిగిలిన వారికి కూడా చెల్లించవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తపరిచింది. జిల్లా ట్రెజరీ అధికారులు మాత్రం జీవోఆర్టీ నెం:187, జీవోఎంఎస్ నంబరు 12లో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని, దీనివల్ల పెండింగ్ రోజుల జీతం బకాయిలను చెల్లించలేమని స్పష్టం చేశారు. వీరి తీరువల్ల ఇన్నేళ్ళ నుంచి కాంట్రాక్టు లెక్చరర్లు 2019 ఏప్రిల్, మే, జూన్ నెల పెండింగ్ జీతాలు అందుకోవటంలో ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

రికవరీ చేయాలంటూ ఆదేశాలిచ్చినా..

తమకు పెండింగ్ వేతనాలు ఇవ్వని పక్షంలో అప్పటికే శాలరీ తీసుకున్న కాంట్రాక్టు అధ్యాపకుల నుంచి సొమ్ము రికవరీ చేయాలని, లేదా వారికి వేతనాలు ఎలా ఇచ్చారో, తమకు కూడా ఇవ్వాలని కోరారు. దీనిపైన స్పందించిన అప్పటి డీటీఏ 2019 ఏప్రిల్, మే, జూన్ నెల పెండింగ్ రోజులకు చెల్లించిన వేతన సొమ్మును కాంట్రాక్టు లెక్చరర్ల నుంచి రికవరీ చేయాలంటూ నంద్యాల జిల్లా డీటీఓ, ఎస్టీఓ ట్రెజరీ అధికారులకు 2020 నుంచి 2022 సంవత్సరాల మధ్యలో మూడు మార్లు మెమోలు జారీ చేశారు. దీంతో నంద్యాల డీటీఓ జీతాలు రికవరీ చేయాలని 2023 ఫిబ్రవరిలో ఆయా ఎస్టీఓలకు అప్పట్లో ఉత్తర్వులు ఇచ్చారు. అయినా జీతాలు రికవరీ కాకపోవటంతో డీటీఏ మరోమారు 2023 అక్టోబరులో జిల్లా ట్రెజరీ అధికారులకు మెమో ఇచ్చారు. దీంతో కొంతమంది ఎస్టీఓలు వేతనాలను రికవరీ చేసేందుకు పూనుకున్నా, నంద్యాల జిల్లాలోని యర్రగుంట్ల కళాశాలలో తప్పించి మిగతా ఎక్కడా కూడా వేతనం రికవరీ కాలేదు. మరి మిగిలిన వారి నుంచి జీతాలు ఎందుకు రికవరీ చేయలేదని డీటీఓతో పాటు మిగిలిన ఎస్టీఓ ట్రెజరీ అధికారులను కాంట్రాక్టు లెక్చరర్లను ప్రశ్నిస్తున్నారు. దీనిపైన సంబంధిత అధికారులు ఎలాంటి సమాధానమివ్వటం లేదు.

నిబంధనల ప్రకారమే చెల్లించాం

2019 ఏప్రిల్, మే, జూన్ నెల పెండింగ్ జీతాలను అడుగుతున్న వారి విషయంలో అప్పటి ప్రభుత్వ జీవో ప్రకారమే నడుచుకున్నాం. కానీ కాంట్రాక్టు లెక్చరర్లు జీవో వచ్చిన విద్యా సంవత్సరానికి సంబంధించినవి కాకుండా, అంతకుముందు సంవత్సరానికి సంబంధించిన జీతాలను అడుగుతున్నారు. అలా ఇవ్వడం కుదరదు. కొంతమంది కాంట్రాక్టు లెక్చరర్లకు అప్పటి ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన జీతాలు పడ్డాయి. వీటిని తిరిగి రికవరీ చేయాలని ఆదేశాలు ఇచ్చాం. త్వరలోనే వాటిని కూడా రికవరీ చేస్తాం. జీతాలు రాలేదని చెబుతున్న కాంట్రాక్టు లెక్చరర్లకు ఇప్పటికే ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేశాం.

- లక్ష్మీదేవి, జిల్లా ట్రెజరీ అధికారి, నంద్యాల

నిబంధనలు తుంగలో..

(5వ పేజి తరువాయి)

'తుంగ'లో టెండరు నిబంధనలు

- తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) కర్ణాటక పరిధిలో 121 కి.మీల వద్ద హగరినదిపై 56 పిల్లర్లతో అక్విడక్ట్ నిర్మించారు. 2022 అక్టోబరులో హగరి (వేదవతి) వరద ఉధృతికి ఒక పిల్లరు కొట్టుకుపోయింది. తాత్కాలిక మరమ్మతు పనులు బళ్లారిలో స్థిరపడిన ప్రకాశం జిల్లాకు చెందిన వైసీపీ రంగు పూసుకున్న కాంట్రాక్టర్‌కు అప్పగించారు. దాదాపు రూ.15 కోట్లు ఖర్చు చేశారు. మరో రూ.40 కోట్లతో శాశ్వత మరమ్మతు పనులకు 2022 డిసెంబరు 13న టెండర్లు పిలిచారు. ఆ కాంట్రాక్టర్‌కు వంతెన నిర్మాణాల అనుభవం లేకపోవడంతో టీబీపీ బోర్డు ఇంజనీర్లు జీఓ-67 ప్రకారం జాయింట్ వెంచర్‌కు అనుమతి ఇచ్చారు. సింగిల్ టెండరు షెడ్యూల్ రావడంతో ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. 2023 జనవరిలో దాదాపు రూ.400 కోట్లతో ఎల్లెల్సీ, హెచ్చెల్సీ లైనింగ్ పనులకు పిలిచిన టెండర్లతో జాయింట్ వెంచర్ నిబంధన తొలగించారు. కేవలం వైసీపీ కాంట్రాక్టర్ ప్రయోజనం కోసమే ఇలా చేశారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై హైదరాబాద్‌కు చెందిన ఓ కాంట్రాక్టర్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చాడు. ఆ తరువాత ఆ కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపి స్టే ఎత్తివేయించినట్లు తెలుస్తుంది.
- తొలి దశలో ప్యాకేజీ-11 కింద రూ.61.26 కోట్లతో ఎల్లెల్సీ 10.00 కి.మీల నుంచి 18.600 కి.మీల వరకు కెనాల్ సెక్షన్, సీసీ లైనింగ్ పనులకు టెండర్లు పిలిచారు. అర్హత కలిగిన ఏ కాంట్రాక్టరు అయినా ఆన్‌లైన్ టెండరు షెడ్యూల్ వేయవచ్చు. ఆ కొండ రాళ్లు కాలువలో పడకుండా గ్రౌటింగ్, షాట్‌క్రీటింగ్ పనులు చేసే టెండరు నిబంధనలు సవరించారు. ఆ పనుల్లో అనుభవం కలిగిన కాంట్రాక్టరు ఒక్కరే టెండరు వేశారు. ఈ నిబంధనల ప్రకారం కొండరాళ్ల మధ్య రంధ్రాలను పూడ్చేందుకు 5 ఎంపీఏ, 2 ఎంపీఏ పవర్‌తో సిమెంట్ గ్రౌండింగ్ పనులు, సిమెంట్, ఇసుక మిశ్రమాన్ని వపర్ గన్‌తో సీసీ లైనింగ్ చేసే షార్ట్‌క్రీటింగ్ చేయాలి. టెండర్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత గ్రౌటింగ్, షార్ట్‌క్రీటింగ్ అవసరం లేదని, కెనాల్ సెక్షన్, సీసీ లైనింగ్ పనులు చాలంటూ వర్క్ మోడిఫికేషన్ (పని సవరణ) చేశారు. ఆ ప్రకారమే బిల్లులు చేశారని తెలుస్తుంది. కాంట్రాక్టర్ ప్రయోజనం అడ్డంగా నిబంధనలు మార్చేసి బోర్డునే భ్రష్టుపట్టించారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.



హొళగుంద మండలంలో చేసిన ఎల్లెల్సీ సీసీ లైనింగ్ పనులు (ఫైల్)



తుంగభద్ర జలాశయం

సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌తో విచారణ చేయిస్తే..

తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు స్వయంప్రతిపత్తి కలిగిన రాజ్యాంగబద్ధమైన సంస్థ కావడంతో.. కాలువలు మోడ్రనైజేషన్ కోసం ఏపీ ప్రభుత్వం రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నా.. ఆ పనుల్లో నాణ్యతాప్రమాణాలపై తనిఖీ ఏపీ ప్రభుత్వం క్వాలిటీ కంట్రోల్, విజిలెన్స్ తనిఖీ చేసే అధికారం లేదు. దీంతో బోర్డులో పని చేసే ఇంజనీరింగ్ అధికారులు కొందరు, కాంట్రాక్టర్లు, ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ ముఖ్య నాయకులు కుమ్మక్కై నిబంధనలు, నాణ్యతాప్రమాణాలు తుంగలో కలిపేసి అడ్డంగా దోపిడి చేస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. దీంతో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) విచారణ చేయిస్తే గత వైసీపీ హయాంలో సాగించిన అవినీతి అక్రమాల గుట్టు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది వైసీపీ హయాంలో జరిగిన మరమ్మతులు, ఆధునికీకరణ పనుల్లో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని అనంతపురం జిల్లా రాయదుర్గం ఎమ్మెల్యే, మాజీ మంత్రి కాల్వ శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

న్యాయ సంస్థల తరలింపు సరికాదు

• వైసీపీ కర్నూలు, నంద్యాల జిల్లా అధ్యక్షులు



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న వైసీపీ నాయకులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కర్నూలు నుంచి జిల్లా నుంచి న్యాయ సంస్థల తరలింపును వైసీపీ వ్యతిరేకిస్తోందని కర్నూలు, నంద్యాల వైసీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. న్యాయ సంస్థలను అమరావతికి తరలించకూడదని న్యాయవాదులతో కలిసి శనివారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు నుంచి జ్యుడీషియల్ సంస్థను తరలించాలన్న టీడీపీ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంతో కర్నూలును న్యాయ రాజధానిగా ప్రకటించారని, జాతీయ న్యాయ విశ్వవిద్యాలయానికి పునాదితో పాటు హెచ్‌ఆర్‌సీ, లోకాయుక్త, వక్ఫ్ ట్రిబ్యునల్, సీబీఐ కోర్టు వంటి సంస్థలు ఏర్పాటు అయ్యాయని వారు వివరించారు. ఈ సంస్థలను మార్చాలని కోరుతూ హైకోర్టులో టీడీపీ ప్రభుత్వం చేసిన అఫిడవిట్ దాఖలు చేయడమంటే శ్రీబాగ్ ఒప్పందాన్ని ఉల్లంఘించడమేనని అన్నారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే న్యాయపరమైన అవకాశాలను అన్వేషిస్తామని, ప్రజా ఉద్యమాలకు దిగుతామని హెచ్చరించారు. అన్ని రాజకీయపార్టీలు, ప్రజా సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర మేయర్ బీవై.రామయ్య, కార్పొరేటర్లు సత్యనారాయణమ్మ, నారాయణరెడ్డి, సోంపల్లి క్రిష్ణకాంత్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

వైసీపీవి స్వార్థ రాజకీయాలు

• టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులవి స్వార్థ రాజకీయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బొజ్జమ్మ నియామకంపై వైసీపీ పలు రకాలుగా దుష్ప్రచారం చేస్తోందని మండి పడ్డారు. గత సార్వత్రిక ఎన్నికల్లో వాల్మీకులు కలిసికట్టుగా పని చేసి పార్టీని జిల్లాలో గెలిపించారని గుర్తు చేశారు. ఆ క్రమంలోనే కప్పట్రాళ్ల బొజ్జమ్మను బోయ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్ పర్సన్‌గా నియమించినట్లు తెలిపారు. ఆమె తండ్రి కప్పట్రాళ్ల వెంకటప్పనాయుడు తెలుగుదేశం పార్టీలో కీలకమైన నాయకుడిగా సేవలందించారని అన్నారు. జిల్లాలో బీసీలకు ఎమ్మెల్సీ, ఎంపీ, ఎమ్మెల్యేగా పార్టీ అవకాశాలు కల్పించిందని తెలిపారు.

21న ఎక్సైజ్ డిపోలో ఫర్నీచర్ వేలం

కర్నూలు అర్బన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ విభాగంలోని ఐఎంఎల్ డిపోలో ఫర్నీచర్‌ను ఈ నెల 21న ఉదయం 10 గంటలకు వేలం వేస్తామని మేనేజర్ శ్రీధర్ రావు తెలిపారు. గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉపయోగించిన ఫ్రిజర్స్-93, ఇన్వర్టర్ విత్ బ్యాటరీ - 96, క్యాస్ చెస్ట్-86, స్కానర్స్-192, క్యాష్‌కౌంటింగ్ మిషన్స్-74 వీటికి సంబంధించి వేలం ప్రక్రియలో పాల్గొన దలచిన వారు ముందుగా రూ. 5 వేలు డిపాజిట్ చెల్లించి వేలం ప్రక్రియలో పాల్గొనాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు డిపో మేనేజర్‌ను ఏపీఎస్‌బీడీసీఎల్ డిపోను సంప్రదించాలని కోరారు.

ఆస్తి కోసం కన్న తల్లిపై కొడుకు దాడి

• ప్రభుత్వాసుపత్రిలో చికిత్స



చికిత్స పొందుతున్న పార్వతి

ఆదోని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం కన్న తల్లిపైనే కొడుకు దాడి చేశాడు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. ఆదోని పట్టణంలోని విక్టోరియా పేటలో పార్వతికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కుమారుడు నాగరాజు జల్సాలకు అలవాటు పడ్డాడు. తాగుడుకు బానిసయ్యాడు. ఇదే క్రమంలో పనులు కోసం బెంగళూరుకు వెళ్లాడు. పార్వతికి తల్లిదండ్రుల నుంచి రెండు ఇళ్లు ఆస్తిలో భాగంగా వచ్చాయి. ఆ ఇళ్లను బాడుగకు ఇచ్చి ప్రభుత్వం ఇస్తున్న పింఛను సహాయంతో జీవనం సాగిస్తోంది. ప్రస్తుతం కూతురు దగ్గర ఉంటోంది. ఇల్లు తన పేరున చేయించాలని పార్వతిపై కొడుకు నాగరాజు ఒత్తిడి తెచ్చాడు. ఆమె ససేమిరా అనడంతో శుక్రవారం తల్లిపై దాడికి పాల్పడ్డాడు. దాడిలో గాయాలకు గురైన పార్వతిని స్థానికులు, బంధువులు ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

జాతీయ క్రీడాకారులను తయారు చేద్దాం

• పీఈటీలకు డోన్ డీఎస్పీ శ్రీనివాసులు పిలుపు



పీఈటీలతో డోన్ డీఎస్పీ శ్రీనివాసులు

డోన్, అక్టోబరు 16: విద్యార్థులను జాతీయ క్రీడాకారులుగా తయారు చేద్దామని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో ఆర్ అండ్‌బీ వసతి గృహంలో డీఎస్పీ వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహిద్దామన్నారు. వివిధ రకాల క్రీడల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో డోన్ క్రీడాకారులు పేరు తెచ్చేలా తయారు చేయాలని పిలుపునిచ్చారు. క్రీడలను ప్రోత్సహించేందుకు అన్ని విధాలుగా తమ వంతు సహకారాలు అందిస్తానన్నారు. త్వరలోనే కబడ్డీ, షటిల్ కోర్టులను అందుబాటులోకి తెస్తామన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా శిక్షణ ఇచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంఈవో ప్రభాకర్, జాతీయ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు చంద్రమౌళి, పీఈటీలు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

కోసిగి నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కోసిగి సర్కిల్ కార్యాలయంలో నలుగురు మట్కా బీటర్లను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఇప్పటి వరకు ఏడుగురు మట్కా డాన్‌లను రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ ఉపేంద్రబాబు తెలిపారు. మట్కా బీటర్ల నుంచి 705 కర్ణాటక మద్యం ప్యాకెట్లతోపాటు మట్కా చీటీలు రూ.2,7300 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. రెండురోజుల్లోనే కోసిగి మండల కేంద్రంలోని మట్కా రాయుళ్లపై కేసులు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

'బెల్టు' పెట్టుకోండి..!

ఊరూరా తిరిగి బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్న మద్యం వ్యాపారులు

గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు



పోలీసులకు దొరికితే పండగే

ఆదోని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మద్యం బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి చంద్రబాబుహెచ్చరిస్తున్నా అందుకు భిన్నంగా ఆదోని నియోజకవర్గంలో విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నారు. గ్రామాల్లోకి మద్యం వ్యాపారులు వెళ్లి గతంలో ఎవరెవరు గొలుసు దుకాణాలు నిర్వహించారో వారంతా మళ్లీ మద్యం అమ్మాలంటూ ప్రోత్సహిస్తున్నారు. ఎంత సరుకు కావాలన్నా ఇస్తామని, పోలీసులతో ఎటువంటి ఇబ్బందులు వచ్చినా దగ్గరుండి పరిష్కరిస్తామని భరోసా ఇస్తూ పల్లెలను మద్యంతో నాశనం చేస్తున్నారు.

గ్రామాల్లో బెల్టు దుకాణం నిర్వహిస్తున్న వారు పోలీసులకు దొరికితే పండుగ చేసుకుంటున్నారు. అందిన కాడికి దోచుకోవడమే కాకుండా అక్కడ ఉన్న మద్యాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు తిరిగి నిర్వాహకుడుపై కేసు నమోదు చేస్తున్నారు. వారం రోజులు క్రితం ఆదోని మండలంలో ఓ గ్రామంలో మద్యం పట్టుబడింది. దొరికిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. దొరికిన మద్యం మాత్రం బహిర్గతం చేయకుండా ఎంతో కొంత మొత్తాన్ని తీసుకొని మళ్లీ వాళ్లకే అప్పు చెబుతున్నారన్న విమర్శలు లేకపోలేదు. ఇటీవల ఆదోని డివిజన్‌లో ఓ ఎస్సై మద్యం దుకాణం నిర్వాహకుడిని అరెస్టు చేశాడు.

25 వేల రూపాయలు తీసుకొని వదిలిపెట్టకుండా తిరిగి అతనిపైనే కేసు నమోదు చేసి అరెస్టు చేయడంతో బెల్ట్ షాపు నిర్వాహకులు పోలీసులపై తిరగబడే పరిస్థితి నెలకొంది. లంచం తీసుకున్నా కేసులు పెట్టడంపై ఆదోని కూటమికి చెందిన బడా నేత దగ్గరకు వెళ్లి తమ గోడును వెల్లబోసు కున్నట్లు సమాచారం. త్వరలో ఎస్పీని కలిసి ఈ విషయాన్ని వివరిస్తామని హెచ్చరిస్తు న్నట్లు తెలుస్తోంది.

అర్ధరాత్రి వరకు..

తెల్లవారు జాము నుంచి అర్ధరాత్రి వరకు మద్యం అందుబాటులో ఉంటోంది. ఒక్కో గ్రామంలో రెండు కంటే ఎక్కువ బెల్టు దుకాణాలు ఉన్నాయి. ఆదోని నియోజకవర్గంలోని 44 గ్రామ పంచాయతీల్లో దాదాపు వంద వరకు బెల్టు దుకాణాలు ఉన్నాయి. రోజు ఒక్కో దుకాణంలో 100 నుంచి 150 వరకు మద్యం సీసాలను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. బెల్టు షాపులో 150కి దొరికే మద్యం అదనంగా 30 నుంచి 50 రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. ఒక్కో దుకాణం నుంచి రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు వ్యాపారం సాగుతోంది.

సిండికేట్‌గా మారి

ఆదోని నియోజకవర్గంలో 12 మద్యం దుకాణాలున్నాయి. విడివిడిగా ఉంటే గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు ఏర్పాటు, సరుకు సరఫరాకు ఇబ్బందులు వస్తాయని వ్యాపారులు సిండికేట్‌గా మారారు. దీని ద్వారా ఏ గ్రామంలోని గొలుసు దుకాణానికైనా.. ఏ దుకాణం నుంచైనా మద్యాన్ని తీసుకువెళ్లవచ్చంటున్నారు. దీంతోపాటు వ్యాపారులు ఒక్కో బెల్టు దుకాణం యజమాని నుంచి డిపాజిట్‌గా రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. కొన్ని చోట్ల ఆయా గ్రామాల్లో వారి అనుచరులకే దుకాణాలు కేటాయించాలంటూ మండల గ్రామ స్థాయి నాయకులు వ్యాపారులకు సిఫార్సు చేస్తుండడం గమనార్హం.

ఉపేక్షించేది లేదు..

గ్రామాలు, పట్టణంలో మద్యం బెల్టు దుకాణాలు నిర్వహిస్తే ఉపేక్షించేది లేదు. ఇప్పటి వరకు ఏడు కేసులు నమోదు చేశాను. ఎక్కడైనా నిర్వహిస్తే సమాచారాన్ని ఇవ్వండి. ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. **- సైదుల్లా, ఎక్సైజ్ సీఐ, ఆదోని**



బెల్టు దుకాణంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

దిన్నెదేవరపాడు వీఆర్వో మృతి

కర్నూలు రూరల్, నవంబరు16(ఆంధ్రజ్యోతి): కర్నూలు రూరల్ మండలం దిన్నెదేవరపాడు గ్రామ వీఆర్వో-2 వి.వెంకటేశ్వర్లు(54) మృతి చెందారు. ఆయన గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండేవారు. శనివారం ఆరోగ్యం క్షీణించడంలో ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. వీఆర్వోకు భార్య ఒక కూతురు ఉంది. విషయం తెలుసుకున్న రూరల్ తహసీల్దార్ టి.వెంకటరమేష్‌బాబు వీఆర్వో స్వస్థలం కర్నూలు రూరల్ మండలం నిడ్జూరు గ్రామానికి వెళ్లి నివాళి అర్పించారు. అనంతరం ప్రభుత్వం తరుపున దహన సంస్కారాల కోసం తహసీల్దార్ రూ.25 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. వీఆర్వోలు బోయ మద్దిలేటి, రామాంజనేయులు, వెంకటేశ్వర్లు, గిడ్డయ్య, దస్తగిరి,నాగరాజు, మల్లేశ్వరి,నాగలక్ష్మీ, రాఘవేంద్ర, శరభరాజు, వీఆర్ఏలు కురువ శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, గోవిందు నివాళి అర్పించారు.



నివాళులర్పిస్తున్న తహసీల్దార్

నంద్యాల చెక్‌పోస్టు వద్ద రోడ్ల విస్తరణ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాల చెక్ పోస్టు నుంచి నందికొట్కూరు వెళ్లే దారిలో రోడ్ల విస్తరణ త్వరలో చేపడుతున్నట్లు నగర పాలక అధికారులు స్పష్టం చేశారు. దీనికి కార్పొరేషన్‌తో పాటు ఆర్‌అండ్‌బీ శాఖతో జిల్లా ఉన్నతాధికారులు సమన్వయంతో ముందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర టౌన్ అండ్ కంట్రి ప్లానింగ్ డైరెక్టర్‌కు నగర పాలక కమిషనర్ లేఖ రాశారు. ఇటీవల నగర పాలకలో జరిగిన కౌన్సిల్‌లో కూడా తీర్మానం చేశారు. మాస్టారు ప్లాన్‌లో ఆమోదించిన ప్రకారంగానే 120 అడుగుల రోడ్డు అభివృద్ధి చేసేందుకు కౌన్సిల్‌లో తీర్మానం చేసినట్లు కమిషనర్ లేఖలో పేర్కొన్నారు. ఎన్‌హెచ్(ఆర్‌అండ్‌బీ) అథారిటీస్ మంజూరు చేసే నిధులు పోగా మిగిలిన నిధులను మంజూరు చేయాలని కోరుతూ ఆర్‌అండ్‌బీఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు.

చిన్నారిపై అత్యాచార యత్నం

చాగలమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారిపై చాగలమర్రిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థులు అత్యాచారయత్నం చేశారు. ఈ సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో యూకేజీ చదివే చిన్నారిపై అదే పాఠశాలలో పదో తరగతికి చెందిన ఇద్దరు విద్యార్థులు అత్యాచార యత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన జరిగిన నాలుగు రోజులకు చిన్నారి తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో వారు చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆళ్లగడ్డ డీఎస్పీ రవికుమార్, ఎస్ఐ రమేష్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. యువకుడి మృతి



మృతి చెందిన నాగరాజు

చాగలమర్రి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబోధనం గ్రామ సమీపంలో 40వ జాతీయ రహదారిపై శనివారం ఆటో బోల్తాపడి ఓ యువకుడు మృతి చెందాడు. రుద్రవరం మండలం నరసాపురం గ్రామానికి చెందిన నాగరాజు (23) మరో వ్యక్తితో కలిసి ఆటోలో కడప జిల్లాలోని మైదుకూరుకు వెళ్లారు. అక్కడ పనులు ముగించుకొని తిరిగి ఆళ్లగడ్డకు బయలుదేరారు. పెద్దబోదనం సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడింది. దీంతో నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. టోల్‌ప్లాజా సిబ్బంది అంబులెన్స్‌లో ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే నాగరాజు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చెంచుల సమస్యలపై రేపు వినతుల స్వీకరణ

ఆత్మకూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం చెంచు గిరిజనుల సమస్యలపై గ్రీవెన్స్ డే ద్వారా వినతులను స్వీకరించనున్నట్లు శ్రీశైలం ఐటీడీఏ పీవో వెంకటశివప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 18వ తేదీన ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లాలోని అన్ని చెంచుగూడేలకు చెందిన గిరిజనుల సమస్యలపై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటామని వెల్లడించారు.

పిడుగుపాటుకు గురైన మహిళ మృతి

హొళగుంద, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): హొళగుంద మండలంలోని గజ్జెహళ్లి గ్రామానికి చెందిన కురువ అనసూయ(32) చికిత్స పొందుతూ మృతి చెందారు. గురువారం మధ్యాహ్నం పొలం పనులు చేస్తుండగా భారీ వర్షాలతో పాటు పిడుగు పడడంతో అనసూయ తీవ్రంగా గాయపడ్డారు. దీంతో మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందారు. భర్త కుబేరస్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు హొళగుంద ఎస్ఐ బాల నరసింహులు తెలిపారు.



అనసూయ(ఫైల్)

బత్తలపల్లి రోడ్డు ప్రమాదంలో ఆదోని వాసి మృతి

ఆదోని, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదోనికి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. బత్తలపల్లి-అనంతపురం రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అనిల్‌కుమార్ (32) అనే యువకుడు మృతి చెందాడు. ఆదోనికి చెందిన నిత్యానంద్ కుమారుడు అనిల్‌కుమార్ గత పది రోజుల నుంచి కనిపించలేదు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం వాహనదారులు గుర్తించి బత్తలపల్లి మండల పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి చేతుల మీద ఉన్న పచ్చబొట్టు ఆధారంగా సామాజిక మాధ్యమాల్లో ఫొటోలను పంపించారు. విషయం తెలుసుకుని కుటుంబ సభ్యులు వచ్చి మృతదేహన్ని గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



మృతి చెందిన అనిల్

కారు బోల్తా.. జవాన్‌కు తీవ్ర గాయాలు



బోల్తా పడ్డ కారు

ఆత్మకూరురూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌ఆర్‌బీసీ కాలనీలో కర్నూలు-గుంటూరు రహదారిపై కారు బోల్తా పడటంతో ధర్మారెడ్డి అనే ఆర్మీ జవాన్ తీవ్రంగా గాయపడ్డారు. కురుకుంద గ్రామానికి చెందిన ధర్మారెడ్డి తన కుమారుడు రోహిత్‌రెడ్డితో కలిసి సొంత పనుల నిమిత్తం కర్నూలుకు వెళ్లారు. తిరిగి సాయంత్రం కర్నూలు నుంచి తన స్వగ్రామానికి కారులో వస్తున్న క్రమంలో మండ లంలోని ఎస్‌ఆర్‌బీసీ కాలనీ వద్ద రహదారిపై అకస్మాత్తుగా కుక్క అడ్డురావడంతో పక్కనే ఉన్న గుట్టపైకి కారు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో ఆర్మీ జవాన్ ధర్మారెడ్డికి తీవ్ర గాయాలు కాగా కుమారుడు రోహిత్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి.

స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రున్ని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ధర్మారెడ్డిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

కార్తీక వనభోజనానికి రండి..



పోస్టర్లను విడుదల చేస్తున్న వాల్మీకి నాయకులు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయల కార్తీకమాస వనభోజన కార్యక్రమాన్ని 24న నిర్వహిస్తున్నామని, అందరూ హాజరు కావాలని వాల్మీకి బోయలు సంఘాల నాయకులు పేర్కొన్నారు. శనివారం వాల్మీకి బోయసంఘాల నాయకులు ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ నగరంలోని బళ్లారి రోడ్డులో వెంకట నాయుడు ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాని తెలిపారు. బోయలందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో తలారి కృష్ణనాయుడు, బేతం కృష్ణుడు, వినోద్ కుమార్, కుంపటి కృష్ణయ్య సత్రం రామకృష్ణుడు, లక్షణ్, నరసింహ, వీరమ్మ, నాగరాజు, రమణ, గోవర్ధన్, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

గూడూరు నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణంలోని ఎబీఎం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మండల విద్యాశాఖ అధికారి సునీలమ్మ శనివారం పరిశీలించారు. విద్యార్థుల హా జరు, బోధన అంశాలను పరిశీలించారు. ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు ఆధార్‌లో పుట్టినతేదీలు తప్పులు ఏమైన ఉంటే వెంటనే ఆధార్ నమోదు కేంద్రాలలో సరిచేసుకోవాలని సూచించారు.

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పేదోడి సొంతింటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. 18న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం స్వామిరెడ్డినగర్, టీవీ9 కాలనీ, పూలసుబ్బయ్య నగర్ తదితర ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు. మునెప్ప మాట్లాడుతూ నగరంలో వేలాదిమంది ఇళ్లు లేక ఇబ్బందులు పడుతూ ఇంటి అద్దెలు కట్టుకోలేకపోతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి రాకముందు పేదలకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామీణా ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. తక్షణమే ఇచ్చిన హామీలుఅమలు చేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాకు రాష్ట్ర కార్యదర్శి కే.రామక్రిష్ణ హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో నగర సహాయ కార్యదర్శి మహేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, రామాంజనేయులు, కోటమ్మ, శైలజ తదితరులు పాల్గొన్నారు

రేపటి నుంచి సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకలు

కర్నూలు కల్చరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలో నెహ్రూ నగర్‌లోగల సత్యసాయి మందిరంలో పుట్టపర్తి సత్యసాయిబాబా 99వ జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నట్లు కర్నూలు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ మాకా అశోక్‌కుమార్ తెలిపారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు సత్యసాయి వ్రతంతో జన్మదిన వేడుకలు ఆరంభమవుతాయని ఆయన పేర్కొన్నారు. 19న సాయంత్రం 5.30 గంటలకు తెల్లాకుల జ్ఞానేశ్వరిచే సంక ల్పం, గణపతి పూజ, శివ అష్టోత్తరం, గౌరీ అష్టోత్తరం, నక్షత్రపూజ, మంగళ హారతి, తీర్థప్రసాదాల వితరణ ఉంటాయని తెలిపారు. 20న యువకులచే గోసేవ, 21న బాలవికాస్ పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలు, 22న సాయి గాయత్రి భజన, వృద్ధాశ్రమంలో, అనాథ శరణాలయాల్లో నారాయణ సేవ, 23న ఎదమం 5.30 నుంచి రాత్రి 7.15 గంటలకు వరకు వివిధ ధార్మిక కార్యక్రమాలు, సత్యసాయి పుట్టినరోజు వేడుకలు ఉంటాయని ఆయన తెలిపారు.

టీజీవీ కళాక్షేత్రంలో నేడు నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం 'ఇది రహదారి కాదు' సాంఘిక నాటక ప్రదర్శన ఉంటుందని కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య తెలిపారు. కళాక్షేత్రంలో ప్రతి ఆదివారం సాంస్కృతిక కార్యక్రమం అనే కార్యక్రమంలో భాగంగా ఈ నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. హైదరాబాదులోని మిత్ర క్రియేషన్స్ నాటక సంస్థ ఆధ్వర్యంలో, భాస్కర చంద్ర రాసిన ఈ నాటకానికి బాషా దర్శకత్వం వహిస్తారని తెలిపారు. నాటక ప్రదర్శనకు ముందు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఉంటాయని పత్తి ఓబులయ్య తెలిపారు.

కందిపోతున్నారు..!

● కంది పూత, కాయను తినేస్తున్న పురుగు

● తగ్గనున్న దిగుబడి.. ● ఆందోళనలో రైతులు

ఓర్వకల్లు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కంది పంటను పురుగు తినేస్తుంది. పంట పూత, కాయ ఆశాజనకంగా ఉంది. పురుగు కాయను తినేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌లో ఈ ఏడాది కందులకు మంచి డిమాండ్ ఉంది. మండలంలోని శకునాల, తిప్పాయపల్లె, పూడిచెర్ల, సోమయాజులపల్లె, కొమరోలు, ఎన్.కొంతలపాడు, మీదివేముల తదితర గ్రామాల్లో 3వేల ఎకరాలకు పైగా సాగు చేశారు. పంట పూతదశలో శనగపచ్చ పురుగు, దోమ పోటు సోకింది. దీంతో పూత రాలిపోతోంది. ఎన్ని మందులు పిచికారీ చేసినా పురుగు నాశనం కావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.



కంది పంట

● ట్రాక్టరుతో పిచికారి చేస్తున్నాం



పురుగు నివారణకు ట్రాక్టరు సాయంతో పంటపై పిచికారి చేస్తున్నాం. అయితే.. పురుగు ఉధృతి తగ్గడం లేదు. దీంతో పెట్టుబడి పెరుగుతుంది. దిగుబడి తగ్గే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే మూడు దఫాలుగా మందు పిచికారి చేశాను.

- సుధాకర్‌రెడ్డి, రైతు, తిప్పాయపల్లె

● సలహాలు ఇవ్వాలి



పురుగు వల్ల చెట్టుకు ఉన్న పూత రాలి నేల పాలవుతుంది. దీంతో దిగుబడి తగ్గుతుంది. పురుగు నివారణకు ఎన్ని మందులు పిచికారి చేసినా ప్రయోజనం ఉండటం లేదు.

- గొల్ల నాగరాజు, రైతు, హుశేనాపురం

● పెట్టుబడులు పెరిగాయి



కంది పంటకు పెట్టుబడులు పెరిగాయి కానీ.. పురుగు దెబ్బతో దిగుబడి తగ్గుతుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పురుగు ఉధృతికి పూత,కాయ రాలిపోతుంది

- పుల్లారెడ్డి, రైతు, పూడిచెర్ల

నిధులు, విధులపై అవగాహన అవసరం

● ఎంపీపీ వెంకటేశ్వరమ్మ

కర్నూలు రూరల్ నవంబరు16 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు మరింత అభివృద్ధి కావాలంటే ప్రభుత్వ నుంచి విడుదలయ్యే నిధులు, విధులపై ప్రతి సర్పంచు, ఎంపీటీసీ సభ్యులకు అవగాహన పెంచుకోవాలని కర్నూలు మండల అధ్యక్షురాలు డి.వెంకటేశ్వరమ్మ అన్నారు. కర్నూలు మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీవో రఘునాథ్ ఆధ్వర్యంలో జట్పీటీసీ సర్పంచు, ఎంపీటీసీ. గ్రామఐక్య సంఘం మహిళలకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఒక్క రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ హాజరై మాట్లాడారు. పంచాయతీలకు రావాల్సిన హక్కుల గురించి తెలుసుకునేందుకు ఇలాంటి శిక్షణ తరగతులు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రధానంగా పల్లెల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజల అవసరాలను గుర్తించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లితే తప్పనిసరిగా నిధులను కేటాయించడం జరుగుతుందన్నారు. ఎంపీడీవో రాఘునాథ్ మాట్లాడుతు రాష్ట్రవ్యాప్తంగా చాలా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు సమస్యలను గుర్తించకపోవడం దాదాపు రూ.400కోట్లు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగిపోయాయన్నారు. ప్రతి గ్రామంలో రెండు సార్లు గ్రామ సభలను ఏర్పాటు చేసి ప్రజలకు అవసమయ్యే వాటిని గుర్తించి వచ్చే ఏడాది జనవరి చివరిలోపు ప్రభుత్వానికి నివేదికను అందజేయాలని ఆయన సర్పంచు, ఎంపీటీసీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ ముప్పసాని నెహమ్యా, ఈవోఆర్డీ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటేశ్వరమ్మ

ఓర్వకలు: ప్రభుత్వం విడుదల చేస్తున్న నిధులను మౌలిక వసతులకు వినియోగించాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. మండలంలోని పొదుపు భవనంలో 2025-26 ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రణాళికల తయారీపై శనివారం శిక్షణ కార్యక్రమాన్ని చిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులను సకాలంలో ఖర్చు చేయాలని, గ్రామాల అభివృద్ధే ప్రణాళికగా ప్రజాప్రతినిధులు పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి తిప్పన్న, జడ్పిటిసి రంగనాథ్‌గౌడ్, ఈఓఆర్డీ సుబ్బరాయుడు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రీసర్వే తప్పులను సరి చేయండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

ఓర్వకల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలో వచ్చిన తప్పులను తక్షణమే సరిచేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఓర్వకల్లులో ఆయన మాట్లాడారు. గ్రామ సభల్లో రీసర్వే కోసం వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న షాజహాన్, దస్తగిరి. ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె

ఓర్వకల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 25వ తేదీ లోపు ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెలోకి వెళ్తామని 108 వాహన ఉద్యోగులు తెలిపారు. శనివారం తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీ వో శ్రీనివాసులుకు సమ్మె నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ 108 సర్వీసులను ప్రభుత్వమే నిర్వహించాలని, గత నాలుగేళ్ల పాలనలో తమకు వేతన సవరణ జరగలేదని, ప్రతి ఏడాది ఇవ్వాల్సిన ఇంక్రిమెంట్లు, అరియర్స్ ఈఎల్ డబ్బులను అరబిందో సంస్థ చెల్లించడం లేదని తెలిపారు. ఉద్యోగులకు చెందిన పీఎఫ్‌లో యాజమాన్య వాటా కూడా ఉద్యోగుల వద్దే వసూలు చేస్తున్నారని వాపోయారు. అదేవిధంగా సెలవులు, గ్రాడ్యుటీ చట్టప్రకారం అమలు చేయడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా 108 ఉద్యోగుల సమస్యలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పైలెట్లు, సురేంద్ర, చాంద్‌బాషా, ఈఎంటీలు మహేష్, సుకన్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న 108 వాహన సిబ్బంది

మందకృష్ణ మాదిగ పర్యటనను విజయవంతం చేయండి

కర్నూలు రూరల్ నవంబరు16(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ 18న చేపట్టే కర్నూలు పర్యటనను విజయవంతం చేయాలని మాదిగ ఉద్యోగ సమాఖ్య జిల్లా ఇన్‌చార్జి జీసీ సుబ్బరాయుడు శనివారం కోరారు. ఎస్సీ వర్గీకరణ 30 ఏళ్ల పోరాట ఫలితంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో దేశం యావత్తు మాదిగలకు న్యాయం జరిగేలా ఉందన్నారు. వర్గీకరణ రథసారథి మందకృష్ణ కర్నూలులోని కోల్స్ కళాశాల మైదానంలో జరిగే ఎమ్మార్పిఎస్ బహిరంగ సభకు హాజరవుతారని సుబ్బరాయుడు వివరించారు. మధ్యాహ్నం మూడు గంటలకు కర్నూలు కలెక్టరేట్ ఆవరణం నుంచి కోల్స్ కళాశాల మైదానం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. కాబట్టి కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి మాదిగలు హాజరుకావాలని ఆయన కోరారు.

అంకితభావంతో పని చేస్తున్నాం

కోడుమూరు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల అంకితభావంతో నిర్వర్తిస్తున్నామని, ఎన్నడూ గర్వంతో వ్యవహరించలేదని పంచాయతీ కార్యదర్శులు అన్నారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల పంచాయితీ కార్యదర్శులు ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం నంద్యాల జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్‌లో పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బందిపై పెత్తనం చేస్తున్నారని, సచివాలయ సిబ్బందిలో పంచాయతీ కార్యదర్శి కూడా ఒకరని అనడం తమ నైతికతను దెబ్బతీసే విధంగా ఉందని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పట్ల ప్రజలకు గౌరవ భావం ఏర్పడేవిధంగా విధులు నిర్వహిస్తున్నామని అన్నారు. సచివాలయ సిబ్బందికి ఉన్నతాధికారులు నిర్ధేశించిన సర్వేలు మాత్రమే కేటాయించామని, గ్రామపంచాయితీ పనులు అప్పగించలేదన్నారు. కలెక్టర్ మెసేజ్ వలన సచివాలయ సిబ్బందికి తమపై చులకన భావం ఏర్పడుతుందని, ఇకపై తమకు కేటాయించిన క్లస్టర్‌కు సంబంధించిన వివరాలు మాత్రమే ఉన్నతాధికారులకు అందజేస్తామని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, స్వామి, వేణుగోపాల్, స్వప్నకుమారి, మురళీధర్, నాగార్జున, రాజ్యలక్ష్మీ, క్రిష్ణయ్య, వెంకటేశ్ పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

'రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలను అమలు చేయాలి'

కర్నూలు కల్చరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన చట్టంలో రాయలసీమకు ఇచ్చి హామీలను నెరవేర్చాలని రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు డిమాండ్ చేశారు. శనివారం 'శ్రీబాగ్ ఒప్పంద దినం' సందర్భంగా వేదిక ఆధ్వర్యంలో రాయలసీమ హక్కుల ఉల్లంఘన దినంగా నిరసన ప్రదర్శన చేశారు. వేదిక కన్వీనర్ భాస్కర్ రెడ్డి అధ్యక్షతన కలెక్టరేట్ ముందు గల మహాత్ముని విగ్రహం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. వక్తలు మాట్లాడుతూ అధికారంలోనికి వచ్చిన ప్రభుత్వాలన్నీ రాయలసీమ పట్ల సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నాయని, ఇక్కడి సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ విభజన చట్టంలో రాయలసీమకు ఇచ్చిన ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, రాయలసీమ ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ నాయకుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, రైతుకూలీ సంఘం నాయకుడు సుంకన్న, ప్రజాభ్యుదయ సంస్థ నాయకుడు శ్రీనివాసరావు, కందనోలు కృష్ణయ్య, డేవిడ్, రవికుమార్, రత్నం ఏసేపు, గద్వాల ఈరన్న, సుబ్బరాయుడు, యోహాను, రాజాసాగర్, రోజా రమణి, మల్లీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకులు

టీడీపీ నేతల ఆగడాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి

- వైసీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు

కర్నూలు కల్చరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలో టీడీపీ పార్టీ నేతల ఆడగాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని వైసీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డిలు అన్నారు. శనివారం నగరంలోని సీక్యాంపు సెంటర్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన షాపులను వారు నగర మేయర్ బీవై రామయ్యతో కలిసి పరిశీలించారు. వైసీపీ 23వ వార్డు నాయకులు సమస్యను వారి దృష్టికి తీసుకురావడంతో తక్షణమే అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని నగర మేయర్‌కు సూచించారు. ఈ సందర్భంగా వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కర్నూలులో ఎప్పుడూ లేని విధంగా అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని, మున్సిపల్ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. సీక్యాంపు సెంటర్‌లో ప్రజలకు, ప్రయాణీకులకు ఇబ్బంది కలిగించే విధంగా షాపుల నిర్మాణాలను ఏర్పాటు చేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. రోజురోజుకూ టీడీపీ నేతలు అక్రమ నిర్మాణాలకు, కబ్జాలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



పనులను పరిశీలిస్తున్న అధికారులు

కల్లూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయితీ రాజ్ డీఈ నాగిరెడ్డి సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. శనివారం కల్లూరు మండలం కొంగనపాడు, ఉలిందకొండ గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన మండల ఏఈఈ రవిమోహన్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. పీఆర్ డీఈ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ రహదారులపై దృష్టి సారించిందని అందులో భాగంగా కొంగనపాడులో రూ.15 లక్షలతో సీసీరోడ్లు, ఉలిందకొండలో రూ.5లక్షలతో రహదారి నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వినోద్‌కుమార్, ఈవీ.రమణ, ఈవీ శ్రీకాంత్, నాగయ్య, లక్ష్మన్న, ఈవీ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటలను సాగు చేయండి

సి. బెళగల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతులు పండ్ల తోటలను సాగు చేయాలని కోడుమూరు ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌గౌడు అన్నారు. శనివారం మండలంలోని మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి, ఇనగండ్ల, సిబెళగల్ గ్రామాలలోని రైతులతో బ్రాహ్మణదొడ్డిలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పండ్ల తోటలు సాగు చేసుకునే రైతులకు ప్రభుత్వం 50 శాతం సబ్సిడీ అందజేస్తుందన్నారు. పండ్ల తోటలను పెంచుకునే రైతులు తోటలలో అంతర్ పంటలను మూడు సంవత్సరాల వరకు సాగు చేసుకోవచ్చు అన్నారు. సన్నకారు రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోడుమూరు ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌గౌడు కోరారు. సమావేశంలో ఆర్టికల్చర్ అసిస్టెంట్లు చెంచురాజు, భరత్‌కుమార్ రైతులు ఉన్నారు.

నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కురువ కురుబ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రామకృష్ణ శనివారం ఉదయం విజయవాడలోని రాష్ట్రమంత్రివర్యులు నారా లోకేశ్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్ర పభుత్వం తనకు కురువ కురుబ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా అవకాశం కల్పించినందునకు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు మంత్రి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయనకు సూచించారు.



నారా లోకేశ్‌ను కలిసిన రామకృష్ణ

బుగ్గరామేశ్వరుని సన్నిధిలో నంద్యాల కలెక్టర్

ఓర్వకల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాల్వ బుగ్గరామేశ్వర స్వామిని నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, పురోహితులు పూర్ణకుంభంతో కలెక్టర్‌కు స్వా గతం పలికారు. కార్తీక మాసం సందర్భంగా కలెక్టర్ ఆలయంలో శివునికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించారు. క్షేత్రం పరిసరాలను కలెక్టర్ పరిశీలించి, ఆలయ చరిత్ర గురించి పురోహితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆలయ ఈవో మద్దిలేటి, ప్రధానార్చకులు కళ్లె లక్ష్మీనారాయణ శర్మ, కళ్లె నరసింహ శర్మలు కలెక్టర్‌కు స్వామివారి శేష వస్త్రం, జ్ఞాపికలను అందజేసి ఆశీర్వదించారు. కలెక్టర్ వెంట ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కాల్వబుగ్గ ఆలయంలో పూజలు చేస్తున్న కలెక్టర్ రాజకుమారిని

తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

● నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు



పాత పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నగరంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగర పాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. శనివారం సుంకేసుల రోడ్డులోని పాత పంప్‌హౌస్, బిర్లా కాంపౌడులోని ఖానా ఖజానాను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో తాగునీటి దాహార్తిని తీర్చేందుకు పలు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అందులో భాగంగా పాత పంప్‌హౌస్ వద్ద 3 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మరో నూతన నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. అనంతరం ఖానా-ఖజానా నుండి సిల్వర్ జుబ్లీ కళాశాల వైపుకు వెళ్లే రహదారిలో అడ్డంగా ఉన్న గోడలను తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ జి.రాజశేఖర్, ఎంఈ శేషసాయి, డీఈ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి : టీడీపీ

గూడూరు నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గ అభివృద్ధికి సహకరించాలని టీడీపీ నాయకులు గజేంద్ర గోపాల్ నాయుడు, పౌలు కోరారు. శనివారం గూడూరులో వారు మాట్లాడుతూ జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సారథ్యంలో నియోజకవర్గంలోని అన్ని రంగాలను ముందుకు తీసుకెళ్లేందుకు అమరావతి సచివాలయంలోని ఆయా శాఖల ఉన్నతాధికారులను కలిశామన్నారు. నిధుల మంజూరుకు అధికార యంత్రాగం సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

ఆదోని టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి కార్యదర్శి నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడుతూ, ఈ అక్రమ రవాణా వెనుక ఒక పోలీసు అధికారి హస్తం ఉందని ఆరోపణలు వస్తున్నాయని, విచారణ చేయాలని, ఐజీ, ఎస్పీకి లేఖ రాశామన్నారు. అనుచరులు ఉన్నారన్న ఆరోపణలపై ఎమ్మెల్యే స్పందించాలని కోరారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

ఆదోని టౌన్ , నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని అమరావతి నగర్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని బీజేపీ నాయకుడు వెల్లాల మధుసూధన్ శర్మ డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ కమిషనర్ కృష్ణకు సమస్యలను విన్నవించారు.


కమిషనర్‌తో మాట్లాడుతున్న శర్మ

రహదారులు గంతలమయంగా మారాయని, సీసీ రోడ్లు నిర్మించాలన్నారు. మహిళలకు సామూహిక మరుగు దొడ్లు ఏర్పాటు చేయాలని, పందులను ఊరిబయటకు తరలించేలా చూడాలని కోరారు. స్పందించిన కమిషనర్ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

యురేనియం తవ్వకాల నిలుపుదలపై హర్షం

దేవనకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో యురేనియం తవ్వకాలను నిలిపేస్తున్నట్లు ప్రభుత్వ ఆదేశాలు రావడంతో టీడీపీ కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రజలు పార్టీలకతీతంగా పోరాటం చేశారన్నారు. ఎమ్మెల్యే విరుపాక్షి ప్రజలను భయభ్రాంతులు చేసేందుకు అభూత కల్పన చేయడం సరికాదన్నారు. తవ్వకాలు జరకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. రామారావు నాయుడు ,మల్లయ్య, రంగన్న, ఉచ్చీరప్ప, మల్లికార్జుగౌడ్, వెంకటస్వామిగౌడ్, రాజశేకర్‌గౌడ్, కప్పట్రాళ్ల మల్లికార్జున, వీరేష్, మలకన్న, గిడ్డయ్యగౌడ్ ఉన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

మదికెర, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు యాదవ్, మార్కెట్‌యార్డ్ మాజీ డైరెక్టర్ శ్రీనివాసులు అన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శనివారం మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడటం తగదన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కక్షసాధింపు చర్యలకు పాల్పడి, టీడీపీ జనసేన, నాయకులు కార్యకర్తలు, విలేక రులపై దాడులు చేశారన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు మండలానికి రూ.2కోట్లు మంజూరు చేశారని పనులు పూర్తి కావచ్చయన్నారు సంజప్ప, లింగమయ్య పాల్గొన్నారు.

‘అక్రమ నిర్మాణాలు తొలగించండి’

పత్తికొండ(వెల్దుర్తి), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అక్రమ నిర్మాణాలను తొలగించాలని మాలమహానాడు నాయకులు అంజనయ్య, శ్రీనివాసులు, కరుణాకర్ డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ చంద్రశేఖర వర్మకు వినతి పత్రం అందజేశారు. రామళ్లకోట రోడ్డులో వంక ఇరువైపులా దుకాణాలు, ఇళ్లు నిర్మించారని చర్యలు తీసుకోవాలని కోరారు. మోహన్ కుమార్, మధుశేఖర్, చెన్నకేశవులు, మధు, కృష్ణ, మనోహర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న గ్రంథాలయ అధికారి సుజాత

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని గ్రంథాలయ అధికారి సుజాత సూచించారు. గంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం గ్రంథాలయ పితామహులు గాడి చర్ల హరిసర్వోత్తరమ రావు, అయ్యంకి వెంకటరమణ చిత్రపటాలకు నివాళి అర్పించారు. గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణ ఆయుర్వేద, ప్రకృతి వైద్యంలో సిద్ధహస్తులన్నారు. ఆదోని గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, మహనీయుల జీవితచరిత్రలు ఉన్నాయన్నారు. బాలికల పాఠశాల ఉపాధ్యాయులు కేశమ్మ, శివజ్యోతి, విశ్రాంత ఉపాధ్యాయురాలు సారమ్మ పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

దేవనకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక దేవనకొండకు చెందిన ఉప్పర మాధవలక్ష్మి (45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసు కుంది. సీఐ వంశీనాథ్ తెలిపిన మేరకు.. మాధవలక్ష్మి మూడు నెలలుగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడు తోంది. శుక్రవారం పొలానికి వెళ్లి పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు వైద్యం కోసం కోడుమూ రుకి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. భర్త నరసింహుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


మాధవలక్ష్మి (ఫైల్)

కందిపోతోంది

- కంది పంటకు ఓ వైపు పురుగు, మరోవైపు పొగమంచు దెబ్బ
- పూత, కాయ రాలి దెబ్బతిన్న పంట


తుగ్గలిలో సాగు చేసిన కంది పంట, ఇన్‌సెట్‌లో గూడు పురుగు

కాపు దశలో ఉన్న కంది పంటను గూడు, పచ్చ పురుగు ఆశించాయి. ఈ పురుగులు పంటను నమిలేస్తుండటంతో పూత, కాయలు రాలిపోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు సలహాలు ఇవ్వాలని కోరుతున్నారు.

తుగ్గలి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఏడాది 24,815 ఎకరాల్లో కంది సాగు చేశారు. పంట ఏపుగా పెరిగి కాపు పట్టడంతో అధిక దిగుబడి వస్తుందని రైతులు సంబరపడ్డారు. అయితే గూడు, పచ్చ పురుగులు ఆశించడంతో ఆశలు ఆవిరయ్యాయి.

పెట్టుబడి కూడా రాదు..

కంది సాగుకు ఎకరాకు రూ.12 వేలకు పైగా ఖర్చు అవుతుంది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చు తదితర ఖర్చులు వస్తాయి. ఎకరాకు 6 క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తేనే గిట్టుబాటు అవుతుం ది. అయితే పంట పూత, కాయ రాలిపోతే పెట్టుబడి వచ్చేలా లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పురుగు మందులు వాడినా తగ్గని పురుగు

పంటను కాపాడుకునేందుకు పురుగు మందులను పిచికారి చేసినా పురుగు తగ్గలేదు. మరోవైపు పొగమంచుతో పూత రాలిపోతోంది. దీంతో ఏం చేయాలో తోచడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారులు పంటను పరిశీలించి, సూచనలు ఇవ్వాలని కోరుతున్నారు.

ఆరుసార్లు మందులు పిచికారీ చేశా



ఐదెకరాలతో పాటు మరో 6 ఎకరాలు కౌలుకు తీసుకుని కంది సాగు చేశాను. రూ.1.20 లక్షలు ఖర్చు అయింది. పంట బాగా పెరిగింది. అయితే పొగ మంచు, పురుగు దెబ్బకు పూత, కాయ రాలిపోతోంది. ఆరుసార్లు మందులు కొట్టినా అదుపు కాలేదు. **- సుంకన్న, పగిడిరాయి**

క్లోరాన్ట్రా నిలిప్రోల్ పిచికారీ చేయాలి



కందిలో గూడు పురుగు, పచ్చ పురుగు (మారకామచ్చల పురుగు) నివారణకు లీటరు నీటికి 0.3మి.లీల క్లోరాన్ట్రానిలిప్రోల్ మందును పిచికారీ చేస్తే పురుగు కంది పంటను ఆశించదు. ఇష్టానుసారంగా పిచికారీ చేస్తే డబ్బులు వృథా అవుతాయి, పురుగు చనిపోదు. **- పవన్ కుమార్, ఏవో, తుగ్గలి**

విక్రయించిన రోజే రైతులకు డబ్బులు చెల్లించాలి

- అసెంబ్లీలో సమస్యలపై గలమెత్తిన ఆదోని ఎమ్మెల్యే

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పంట ఉత్పత్తులు విక్రయించిన రైతులకు అదేరోజు చెల్లింపులు చేయాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి కోరారు. ఈమేరకు శనివారం అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్లో ఎమ్మెల్యే మాట్లాడారు. విక్రయాలు చేశాక 14-17 రోజుల అనంతరం దళారీ వ్యాపారులు చెల్లిస్తున్నారని, ఈ విష సంస్కృతిని రూపుమాపాలను వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి దృష్టి పెట్టాలని కోరారు. ఆదోని మార్కెట్ రాష్ట్రంలోనే అతిపెద్దదని, వర్షం వస్తే వేరుశనగ పత్తి దిగుబడులు వర్షపు నీటిలో కొట్టుకుపోతున్నాయని, రైతులకు తీవ్ర నష్టం వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డు అధికారుల దృష్టికి తీసుకెళితో నిధులు లేవంటున్నారని తెలిపారు. వేరుశనగ దిగుబడులకు పాసింగ్ విధానంతో రాళ్లు, మట్టి దుమ్ము ధూళి తొలగించే కొనుగోలు చేయడం వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. ఎప్పటినుంచో కొనసాగుతున్న ఈ విధానాన్ని రద్దు చేయాలన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- జోన్ సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి తంగమణి


మాట్లాడుతున్న న్యాయాధికారి తంగమణి

పత్తికొండ(వెల్దుర్తి), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపై అవగాహన పెంచ ుకోవాలని జోన్ సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి తంగమణి సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మహిళలు ఎన్నో సమస్య లను ఎదుర్కొంటున్నారని, ఆర్థిక స్వావలంబన దిశగా ముందడుగు వేయాలన్నారు. బాల్యవి వాహాలు, బాల కార్మికుల వ్యవస్థను నిర్మూలిం చాలని పిలుపునిచ్చారు. సమస్య వచ్చినపుడు ధైర్యంగా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. అత్యాచారాలు, అదనపు కట్నం వేధింపులు, సమాన పనికి సమానవేతనం, మహిళల అక్రమ రవాణా, లోక్ అదాలత్ పనితీరుపై మహిళలకు అవగాహన కల్పించారు. న్యాయవాదులు గోపాల్ రెడ్డి, కుమారి, సీడీపీఓ లూక్, ఎస్ఐ అశోక్ ఉన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి రక్షణ

ఆదోని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి రక్షణ ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకు డు ఉమాపతి నాయుడు అన్నారు. శనివారం విక్టోరియా పేటలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. రూ.వంద చెల్లించి సభ్యత్వం తీసుకుంటే రూ.5లక్షల బీమా వస్తుందని, పార్టీకి కార్యకర్తలే బలమన్నారు. అఫ్సర్ బాషా, ఇక్బాల్, మాబాషా, డిష్ బాషా, సాదుల్లా, గౌస్ పాల్గొన్నారు.


టీడీపీ సభ్యత్వం అందిస్తున్న ఉమాపతి నాయుడు

ఉపయోగపడే పనులు కల్పించాలి

తుగ్గలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకం కింద రైతులకు ఉపయోగపడే పనులు కల్పించాలని ఏపీవో హేమసుందర్, పంచాయతీ సలహాదారుడు వెంకటపతి సూచించారు. శనివారం చెన్నంపల్లి గ్రామంలో జాతీయ ఉపాధిహామీ పథకం పనులపై గ్రామసభ నిర్వహించారు. వచ్చే ఏడాది చేపట్టబోయే పనులను ముందుగానే గుర్తించాలని, రైతుల అంగీకారంతో చేయాలన్నారు. జాబ్‌కార్డు తీసుకోవాలని, వ్యవసాయ పనులు ముగిసిన ప్రతి గ్రామంలో పనులు కల్పిస్తామన్నారు. ఈసీ.ప్రదీప్ కుమార్, టీఏలు రామాంజి, చంద్ర, రాజేంద్రగౌడు, అక్బర్ ఉన్నారు.

ఇష్టపడి చదవాలి

మద్దికెర, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఇష్టపడి చదివితే ప్రయోజకులవు తారని కెనరా బ్యాంక్ మేనేజర్ వెంకటేష్ గౌడ్ అన్నారు. శనివారం ఫ్రెండ్స్ విద్యానికేతన్‌లో వ్యాసరచన పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ రామాంజినేయులు, ఉపాధ్యాయులు రమేష్, మస్తాన్, ఉన్నారు.


బహుమతులు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి


మాట్లాడుతున్న మాల మహానాడు పట్టణ అధ్యక్షుడు

ఆదోని అగ్రికల్చర్ , నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాలలంతా ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఐక్యతతో పోరాటాలకు సిద్ధం కావాలని వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి పట్టణ అధ్యక్షుడు బొబ్బిలి పిలుపు నిచ్చారు. శనివారం జీబీ గార్డెన్‌లో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. రాజకీయ దురుద్దేశంతోనే ఎస్సీలను వర్గీకరణ పేరుతో విడదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 29న విజయవాడలో మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని పాల్గొనాలన్నారు. సురేశ్, సాయిరాం, గిరి, కృష్ణ అరవిందు, నీలకంఠ, నరేష్ పాల్గొన్నారు.

వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా మంజునాథ్

ఆలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఏపీ వాల్మీకి బోయ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా ఆలూరుకు చెందిన జనసేన నాయకుడు మంజునాథ్ నియమితుల య్యారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్‌పర్సన్‌గా కప్పట్రాళ్ళ బొజ్జమ్మను ప్రభుత్వం ఇప్పటికే నియమించింది. తనకు అవకాశం కల్పించిన ప్రభుత్వా జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు, జనసేన జిల్లా, నాయకులు చింత సురేష్‌కు, తాలూకా ఇన్‌చార్జి వెంకప్పకు మంజునాథ్ ధన్వవాదాలు తెలిపారు.


మంజునాథ్

రేపు చలో కలెక్టరేట్


వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

ఆలూరు రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): చర్చల్లో కుదిరిన ఒప్పందాలను అమలు చేయాలని కోరుతూ సోమవారం నిర్వహిస్తున్న ఆశా వర్కర్ల చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ స్వామి, కార్యదర్శి షాకీర్ కోరారు. శనివారం కమ్మరచేడు, మొలగవల్లి వైద్యాధికారులకు వినతిపత్రం అందజేశారు. రూ.25 వేలు ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లుగా గుర్తించా లని, పనిభారం తగ్గించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, వేతనం లో సగం పెన్షన్ ఇవ్వాలన్నారు. కళావతి, సుశీల, మల్లిక, సునీత, లక్ష్మి, అనూష పాల్గొన్నారు.

నేడు కార్తీక వనభోజనం

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నేడు తిరుమల్ నగర్ కాలనీ నివాసులు భారతి తీర్థ ఉద్యాన వనంలో కార్తీక మాస వన భోజనాత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కాలనీవాసులు రఘురామయయ, కృష్ణ మూర్తి గౌడ్, హనుమంత రావ్, గోపాల్, శివరాం రెడ్డి, శ్రీకాంత్, ధనుజయ రెడ్డి, నర్సయ్య గౌడ్ తెలిపారు. ఉదయం 9గంటలకు ఉసిరి పూజతో కార్యక్రమం మొదలవుతుందన్నారు. సాయంత్రం వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు విద్యార్థులకు బహుమతులు ప్రధానం ఉటుందని తెలిపారు. కాలనీవాసులు కుల మతాలకతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గుంతల పూడ్చివేత


చెన్నంపల్లిలో గుంతలు పూడ్చుతున్న టీడీపీ నాయకులు

తుగ్గలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రహదారనుల ప్రమాద కరంగా ఉన్న గుంతలను టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటపతి ఆధ్వర్యంలో పూడ్చివేశారు. శనివారం చెన్నంపల్లిలో సచివాలయం, అంగన్‌వాడీ, హెల్త్‌క్లినిక్ కార్యాలయాల పక్కన గుంతలను గుర్తించి సర్పంచు రంగమ్మతో కలిసి ఎక్స్‌కవేటర్ ట్రాక్టర్ సాయంతో గరుసు వేశారు. ఎమ్మెల్యే శ్యాంబాబు సహకారంతో గుంతలను పూడ్చామన్నారు. రాజేంద్రగౌడు, ఉరుకుందు, అక్బర్, సంజీవ్‌చౌదరి తదితరులు ఉన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కుటుంబానికి భరోసా

తుగ్గలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కుటుంబానికి భరోసా ఉంటుందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు తిరుపాలునాయుడు, నాయకులు ఆదినారాయణ, శ్రీరాములు, మోహన్ అన్నారు. శనివారం మండలంలోని శెభాష్‌పురం, పైచింతలకొండలో టీడీపీ పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహించారు. వెంకటరాముడు, లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

దేవనకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై ఎఐఎస్ఎఫ్ అలుపెరగని పోరాటాలు చేస్తుందని జిల్లా సహాయ కార్యదర్శి శరత్‌కుమార్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద 49వ రాష్ట్రమహసభల కరపత్రాలను విడుదల చేశారు. విజయనగరంలో నిర్వహించనున్న రాష్ట్రమహాసభలను జయప్రదం చేయాలన్నారు.

కార్యదర్శుల హక్కుల కోసం పోరాడదాం

దేవనకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల హక్కులకై పోరాడాలని ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ రఫీ, శివశంకర్‌సింగ్ పిలుపు నిచ్చారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్యదర్శులపై భారం మోపిందని, కార్యదర్శులపై ఇతర శాఖల పెత్తనం తగదని, తమకు ప్రభుత్వం వేతనం పెంచాలన్నారు. అనంతరం కార్యదర్శిగా శివశంకర్‌సింగ్, అధ్యక్షుడిగా రఫీ, ఉపాధ్యాక్షుడిగా డి.రాముడు, ట్రెజరర్‌గా సునీతను ఎన్నుకున్నారు. నాగార్జున, రాముడు, మధు, సుంకన్న, విమల, రిజ్వా, సునీల్, లక్ష్మన్న పాల్గొన్నారు.

మాదిగల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

ఆలూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఈ నెల 18న మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల గాదిలింగ పిలుపు నిచ్చారు. శనివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కరపత్రాలను విడుదల చేశారు. ఎస్సీ వర్గీకరణకు 30 ఏళ్లుగా మంద కృష్ణ చేసిన పోరాటాల ఫలితంగానే వర్గీకరణ సాధ్యమైందన్నారు. సుదాకర్, శేఖర్, ఉచ్చు రంగప్ మల్లయ్య, మహేష్ కృష్ణ, అంజి, నెట్టె కంటయ్య పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సీజ్

- ఓ యువనాయకుడి దందాకు సీఐ అండదండలు!
- పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎస్పీ
- రంగంలోకి స్పెషల్ బ్రాంచ్


పట్టుబడ్డ రేషన్ బియ్యంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు

ఆదోని రూరల్ నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ యువనాయకుడి బియ్యం దందా ఒక్కొక్కటిగా బయట పడుతోంది. పేదలకందే బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందాకు ఓ సీఐ అండదండలు ఉన్నాయని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు సమాచారం రావడంతో రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహిం చారు. దీంతో ఆంధ్రజ్యోతిలో రేషన్ బియ్యం, సీజ్, ఎమ్మెల్యే అనుచరుడినే గుర్తింపు శీర్షికన కథనం ప్రచురితం అయిన విషయం విధితమే. స్పందించిన ఎస్పీ బిందు మాధవ్ ఆదోని పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో స్పెషల్ బ్రాంచ్ పోలీసుల సమాచారం మేరకు రెవెన్యూ, పోలీసులు శనివారం రాత్రి 10 గంటలకు బియ్యం డాన్ సొంత గ్రామం సంతేకూడ్లురు సమీపంలోని బలాదూ ర్‌లోని యడవలి పాండు నివాసంలో దాడులు నిర్వహించి 30 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు, అధికా రులు దాడుల సమాచారం తో బియ్యం దొంగలు పరారయ్యారు. ఈ బియ్యం మొత్తం ఎమ్మెల్యే అనుచరుడు సంతేకూడ్లురు మధువే నని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. ఇస్వి ఎస్ఐ నాగేంద్ర, ఆర్ఐ కాశీమ్, వీఆర్‌వోలు ఈరన్న, రాజశేఖర్ గౌడ్ పాల్గొన్నారు.

అసభ్యకర పోస్టులు పెడితే జైలుకే..

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఆదోని రూరల్ సీఐ నల్లప్ప



ఆదోని రూరల్ నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెడితే జైలుకు పంపుతామని ఆదోని రూరల్ సీఐ నల్లప్ప హెచ్చరించారు. ఆంధ్రజ్యోతికి ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: పోలీసులకు లంచాలు ఇవ్వాలని ఆరోపణలు ఉన్నాయా?

జవాబు: ప్రభుత్వం మాకు వేతనాలు అస్తోంది. లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేదు.

ప్రశ్న: బైక్ రైడర్ల వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎలా కట్టడి చేస్తారు ?

జవాబు: రాష్ డ్రైవింగ్ నివారణకు వాహనాలను తనిఖీ చేస్తున్నాం. రైడర్ల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి, బిడ్డలపై నిఘా ఉంచాలని చెప్తున్నాం.

ప్రశ్న: కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. గ్రామాల్లో బెల్టుషాపులు వచ్చాయి?

జవాబు: కర్ణాటక మద్యం నివారణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం, బెల్టుషాపుల నిర్వాహకులకు చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: బియ్యం అక్రమ రవాణాకు పోలీసుల అండ ఉందంటున్నారు?

జవాబు: అక్రమార్కులు ఎవరైనా పోలీసుల అండదండలు ఉండవు.

ప్రశ్న: సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచారా?

జవాబు: అనుమానితులు, రౌడీ షీటర్ల కదలికపై నిఘా ఉంచాం. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: దొంగతనాలు ఎలా అరికడతారు?

జవాబు: తాళాలు వేసి వెళ్లేవారు పోలీసులకు సమాచారమిస్తే గస్తీ నిర్వహిస్తాం.

ప్రశ్న: మట్కా, పేకాట, అసాంఘిక కార్యాలను ఎలా అరికడతారు?

జవాబు: అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతాం. సమాచారమిచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం

మహిళలు, బాలికలపై దాడులు చేస్తే చర్యలు: డీఎస్పీ

కోసిగి నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలో మహిళలు, బాలికలపై దాడులు చేస్తే చర్యలు తప్పవని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ బాలికలు, మహిళల పట్ల జరుగుతున్న నేరాలు వాటి నుంచి రక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థినులకు వివరించారు. అలాగే బాల్య వివాహాలపై విద్యార్థినీలు అవగాహన కలిగి ఉండాలని, 18 ఏళ్లలోపు బలవంతంగా పెళ్లిలు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థినులను సూచించారు. సైబర్ నేరాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే విద్యార్థినీలు సెల్‌ఫోన్లు అతిగా వినియోగించరాదన్నారు. ఇందులో కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్, పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

ఏకసభ్య కమిషన్ ఏర్పాటుపై హర్షం



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎమ్మిగనూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ అమలు దిశగా అడుగులు వేయడంలో భాగంగా ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేయటం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆనంద్ చైతన్య అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ముప్పైఏళ్ల సుదీర్ఘ సామాజిక పోరాటం, ఇరవై ఏళ్ల న్యాయపోరాటం అనంతరం సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిందన్నారు. దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ వినతి మేరకు వర్గీకరణ కోసం విశ్రాంత ఐఏఎస్ రాజీవ్ మిశ్రాతో ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసిందన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాయకులు పెద్దయ్య, ప్రతాప్, పౌలయ్య పాల్గొన్నారు.

జై భీమ్ ఎమార్పీఎస్ ఆధ్వర్యంలో..

ఎమ్మిగనూరు టౌన్: ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయడం హర్షనీయమని జై భీమ్ ఎమార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ అన్నారు. శనివారం పట్టణంలోని స్థానిక జై భీమ్ ఎమార్పీఎస్ జిల్లా ఉప కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో జై భీమ్ ఎమార్పీఎస్ నాయకులు బుజ్జిబాబు, శాంతిరాజు, ఆదాము, ఆనంద్, సత్యానందం పాల్గొన్నారు.

గోనెగండ్ల: ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం వెంటనే అమలు పరచాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహాదేవ్ అన్నారు. శనివారం మండల కేంద్రమైన గోనెగండ్లలో ఆయన ఎంఆర్‌పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న కర్నూలు నగరంలో మాదిగల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగ వస్తున్నారని తెలిపారు. సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నరసింహులు, శివ, నాగరాజు, రవి, దేవరాజు, నరసన్న, ఈశ్వర్, ఎరుకల నాగన్న, రంగన్న, సతీష్, మద్దిలేటి పాల్గొన్నారు.

పెండింగ్ మెస్ చార్జీలను విడుదల చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు ఆరునెలలుగా పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం అయి ఆరు నెలలు కావస్తున్న మెస్ చార్జీలు నేటి వరకు విడుదల కాలేదన్నారు. ప్రభుత్వ నుంచి రావాల్సిన మెస్ బిల్లులు విడుదల విడుదల కాకపోవడంతో హాస్టల్స్‌ను నిర్వహించడం వార్డెన్‌లకు భారంగా మారిందన్నారు. చలికాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతి విద్యార్థికి బెడ్ షీట్లు, యూనిఫాములు, ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మధు, నవీన్ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ను విధుల్లోకి తీసుకోవడం సరికాదు


కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్,నవంబర్ 16 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు కేజీబీవీ ప్రిన్సిపాల్ కవితను విధుల్లోకి తీసుకోవడం సరికాదని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. శనివారం స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలో సోమప్ప సర్కిల్‌లో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కళ్లకు నల్ల బ్యాడ్జీలు కట్టుకొని నిరసన తెలిపారు. ఆ సంఘం నాయకులు మహేంద్ర బాబు, శేఖర్, ఆఫ్రిద్ మాట్లాడుతూ ఎస్‌వోపై నాడు విచారించి అవినీతి పాల్పడినట్లు గుర్తించి సస్పెండ్ చేసిన ఉన్నతాధికారులు నేడు మళ్లీ విధుల్లోకి తీసుకోవడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు కృష్ణ, నవీన్, చరణ్ పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి రూ.50వేలు

కౌతాళం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయంలో అన్నదాన పథకానికి రూ.50 వేల నగదును ఓ భక్తుడు విరాళంగా అందించినట్లు డిప్యూటీ కమిషనర్, ఈవో విజయరాజు తెలిపారు. ఈవో మాట్లాడుతూ శాశ్వత అన్నదాన పథకానికి ఆదోనికి చెందిన గుళ్లెం శివమ్మ కుటుంబ సభ్యులు రూ.50 వేల నగదును ఆలయ సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్‌కు అందజేసినట్లు తెలిపారు.

పట్టించుకోరా?

ఎమ్మిగనూరు, (ఆంధ్రజ్యోతి) 16 : ఎన్నేళ్లయినా ఎదురుచూపులే.. ప్రభుత్వాలు మారినా పరిహారం అందడం లేదు. ఎమ్మిగనూరు మండలంలోని గువ్వలదొడ్డి గ్రామ పరిధిలో నల్లబండ వంకపై 2012లో అప్పటి ప్రభుత్వం చెరువు నిర్మించింది. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం, అప్పట్లో కురిసిన వర్షానికి చెరువులో నీరు నిండి ప్రారంభానికి ముందే చెరువుకు గండిపడి కరకట్ట కొట్టుకు పోయింది. పుష్కరకాలమైన చెరువుకు మరమ్మతులు చేయకపోగా.. భూములు ఇచ్చిన రైతులకు పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వాలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. దీంతో రైతులు పరిహారం ఎప్పుడు ఇస్తారా.. చెరువుకు మరమ్మతులు ఎప్పుడు చేస్తారు.. తమ పొలాలకు సాగనీరు ఎప్పుడు అందుతందోనని ఎదురు చూస్తున్నారు.

- రైతులకు అందని పరిహారం.. సాగు నీరు
- ప్రారంభానికి ముందే తెగిన గువ్వలదొడ్డి చెరువు
- మరమ్మతుల గురించి పట్టించుకోని పాలకులు

● **రూ. 2.70 కోట్లతో చెరువు నిర్మాణం:** మండలంలోని గువ్వలదొడ్డి , పార్లపల్లి, పెద్దమర్రివీడు గ్రామాల పరిదిలో 350 ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో గువ్వలదొడ్డి గ్రామ సమీపంలో ఉన్న నల్లబండ వంక పై 120ఎకరాల విస్తీర్ణంలో రూ. 2.70కోట్లతో చెరువు నిర్మాణ పనులను చేపట్టారు. ఈ పనులను 2012 నవంబర్‌లో ప్రారంభించి మార్చి 2013కు పూర్తి చేశారు.

ప్రారంభానికి ముందే గండి..

చెరువు పనులు పూర్తయి కాలువ పనులు జరుగుతుండగానే 2013 సెప్టెంబర్ 15వ తేదీన వర్షానికి వంక పొంగి పొర్లడంతో దానిపై నిర్మించిన చెరువు కరకట్టకు గండిపడింది. చెరువు నిర్మాణ పనుల్లో నాణ్యతకు తిలోదకాలకు ఇవ్వడం ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కరకట్టకు వాడిన రాళ్ల పరుపు, మట్టి సరైంది కాకపోవడంతో ప్రారంభానికి నోచుకోకముందే గండి పడి కరకట్ట కొట్టుకు పోయింది. దాదాపు 12ఏళ్ల కావటంతో చెరువులో ముళ్ల కంపలు ఏపుగా పెరిగిపోయాయి. అంతేగాక కరకట్ట అక్కడక్కడ దెబ్బతింటున్నాయి. కరకట్ట పైన సైతం పెద్దపెద్ద చెట్లు పెరిగిపోయాయి.


ప్రారంభానికి ముందే తెగిపోయిన గువ్వలదొడ్డి చెరువు కరకట్ట

● పుష్కరకాలం కావస్తున్నా రైతులకు అందని పరిహారం..


ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లు

చెరువు నిర్మాణం పనులు చేపట్టక ముందే రైతుల నుంచి సేకరించిన భూములకు నష్ట పరిహారం అందించాల్సి ఉంది. అయితే ఇక్కడా మాత్రం ఆ తంతు జరగలేదు. రైతుల నుంచి 120 ఎకరాలు భూములు సేకరించిందే తడువుగా పనులు చేపట్టడం, పూర్తి చేయడం జరిగింది. అంతే వేగవంతంగా చెరువు కరకట్ట సైతం గండిపడి కొట్టుకపోవడం గమనార్హం. పన్నెండేళ్లక్రితం నిర్మాణ సమయంలో అప్పటి ప్రజాప్రతినిధి భూముల పరిహారం అందుతుందంటు దాటవేశారని రైతులు ఆరోపిస్తున్నారు. చెరువుకు పడిన గండి పనులకు మరమ్మతులు చేసేందుకు అధికారులు, కాంట్రాక్టర్ 2014మేలో చెరువు దగ్గరకు వెళ్లారు. అయితే రైతులు తమ భూములకు పరిహారం చెల్లించి పనులు చేపట్టాలని రైతులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు, కాంట్రాక్టర్ పలాయనం చిత్తగించారు.

● నీరు గారిన ప్రభుత్వం లక్ష్యం

350ఎకరాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో రూ. 2.70కోట్లు వెచ్చించి 120ఎకరాల్లో నల్లబండ చెరువును ప్రభుత్వం 2013లో నిర్మించింది. అయితే కోట్ల రూపాయల నిధులు ఖర్చు అయిన ప్రభుత్వ ఆశయం మాత్రం నేరవేరలేదు. సరి కదా.. చెరువు నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులకు పన్నెండేళ్లు అయినా పరిహారం అందకపోవడం అధికారులు, పాలక ప్రభుత్వాల నిర్లక్ష్యానికి తార్కనంగా నిలుస్తోంది.

7.21ఎకరాలకు పరిహారం అందలేదు

గువ్వలదొడ్డి చెరువులోకి 7.23ఎకరాల భూమి పోయి దాదాపు 12ఏళ్లు అయ్యింది. ఇంతవరకు పరిహారం రాలేదు. చెరువుకు మరమ్మతులు చేయలేదు. భూమిపై బ్యాంకులో రుణం తెచ్చుకునే అవకాశం లేకుండా పోయింది. గతంలో భూమిపై తీసుకున్న రుణం రెన్యూవల్ చేసుకునే అవకాశం కూడా లేకుండా పోవడంతో అప్పు కాస్త రెట్టింపయ్యింది. దీంతో బ్యాంకు అధికారులు నోటీసులు పంపారు. మా బాధ ఎవరికి చెప్పుకోవాలి..

- లక్ష్మి, గువ్వలదొడ్డి

● రైతుల పట్ల నిర్లక్ష్యం

చెరువు కట్టేందుకు మా భూములు ఇచ్చాం. పరిహారం ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం సరైందికాదు. పన్నెండేళ్లుగా పరిహారం ఇవ్వకుంటే ఎలా.. జీవనం సాగించేది. ఇదా రైతుల పట్ల పాలక ప్రభుత్వాలకు ఉండే చిత్తశుద్ధి.

- పెద్దయ్య, రైతు, గువ్వలదొడ్డి

● 12 ఏళ్లుగా పరిహారం లేదు


మా భూములు చెరువులోకి పోయి 12ఏళ్ల గడుస్తుంది. ఇప్పటివరకు భూపరిహారం ఇవ్వలేదు.తెగిన చెరువుకు మరమ్మతులు చేయలేదు. దీంతో పంటలు పండించుకునే అవకాశం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వమైనా మా సమస్యను పరిష్కరించాలి.

- లింగన్న గౌడ్, రైతు, గువ్వలదొడ్డి


కట్టకు పడిన గొయ్యి

● వైసీపీ ప్రభుత్వంలో జీవో తప్ప నిధులు విడుదల చేయలేదు

వైసీపీ ప్రభుత్వంలో గత ఏడాది గువ్వలదొడ్డి చెరువు మరమ్మతులకోసం, భుములిచ్చిన రైతులకు పరిహారంల కోసం రూ. 9.23కోట్లు నిధులు కేటాయిస్తు జీవో విడుదల చేసింది. అయితే అందుకు సంబంధించిన నిధులు మాత్రం విడుదల చేయకుండా మొండిచెయ్యి చూపింది. దీంతో రైతులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. అంతలోనే ఎన్నికలు రావడం రాష్ట్రంలో వైసీపీ ఓడిపోయి టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చింది. కనీసం కూటమి ప్రభుత్వమైన చెరువుకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.


చెరువుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులు తాత్కాలికంగా సాగు చేసుకున్న పంటలు

విభజన హామీలను అమలు చేయాలి

ఎమ్మిగనూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఏపీ విభజన చట్టంలో రాయలసీమకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాయలసీమ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఎమ్మిగనూరు కన్వీనర్ టీచర్ నాగన్న డిమాండ్ చేశారు. శనివారం ఐక్యవేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల తరబడి రాయలసీమ అన్యాయానికి గురవుతూనే ఉందన్నారు. పాలకులు మారుతున్నా రాయలసీమ పరిస్థితులు మారటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కరువు, వలసలు, రైతుల ఆత్మహత్యలు తగ్గటం లేదన్నారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయాలని కోరుతున్న పాలక ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదని విమర్శించారు. పెద్దఎత్తున ప్రజలు ఉద్యమిస్తే తప్ప సమస్యలు పరిష్కారం కావన్నారు. శ్రీబాగ్ ఒప్పందం జరిగిన నవంబరు 16ను రాయలసీమ హక్కుల ఉల్లంఘన దినంగా సీమ ప్రజలు జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం డీటీ వీరభద్రగౌడ్‌కు వినతిప్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు బతకన్న, సంజీవ్, శేఖర్, వీరేష్ యాదవ్, ఖాజా, మహేంద్ర, కృష్ణ, సురేంద్ర, వెంకటేష్, నాగరాజు, అఫ్రిద్ పాల్గొన్నారు.

మాచాపురంలో సీసీ రోడ్డు పరిశీలన


మాచాపురంలో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

నందవరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచాపురంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నిర్మించిన సీసీ రోడ్లను శనివారం ఈవోపీఆర్డీ సందీప్ ఆధ్వర్యంలో పరిశీలించారు. గ్రామంలో సీసీ రోడ్డుకు రూ.10 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. నాణ్యతగా పనులు చేయాలని సూచించారు. అలాగే గ్రామంలో జరుగుతున్న రైతు బీమా, హెల్త్ క్లినిక్ భవనాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుల్లయ్య, ఈవోపీఆర్డీ సందీప్, పీఆర్ ఏఈ నరసింహులు, పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డి, టీడీపీ క్లస్టర్ కాశీంవలి, మాబువలి పాల్గొన్నారు.

సాగు నీటి ప్రాజెక్టులను పునరుద్ధరించాలి


మంత్రి నిమ్మల రామనాయుడుకు నియోజకవర్గ సమస్యలు వివరిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి

మంత్రాలయం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో నిలిచిపోయిన అభివృద్ధి, సాగునీటి పనులకు నిధులు మంజూరు చేసి, సాగు నీటి ప్రాజెక్టులను పునరుద్ధరించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి కోరారు. శనివారం అమరావతిలో జలవనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామనాయుడును కలిసి రాఘవేంద్రరెడ్డి వినతి పత్రం అందజేశారు. అలాగే స్థానిక సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడం వల్ల కరువు ఎక్కువగా ఉండడంతో రైతు కుటుంబాలు వలసలు వెళ్తున్నారని తెలిపారు. వలసలు నివారణ కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించి మంత్రాలయం అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సాగు,తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, ఆర్‌అండ్‌బీ రోడ్లు, అన్నక్యాంటీన్ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రైతు అధికార ప్రతినిధి, దూదేకుల రాష్ట్ర గౌరవ సలహాదారుడు సాయిబాబ, టీడీపీ నియోజకవర్గ యువనాయకులు రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు

మంత్రాలయం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆ శాఖ సిబ్బంది వసంత లక్ష్మి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రంథాలయ ఉద్యమ నిర్మాత అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరు నాగభూషణం, వెలగ వెంకటప్పయ్య, గాడిచర్ల హరి సర్వోత్తమరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వసంత లక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పాఠకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం


ఖగ్గల్‌లో రీసర్వే భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్

మంత్రాలయం, నవంబరు 16 (ఆంధ్ర జ్యోతి): భూ రీసర్వేలో జరిగిన తప్పులను సరిచేస్తున్నట్లు తహసీల్దార్ రవి తెలిపారు. శనివారం మండల పరిధిలోని కాగ్గల్‌లో గ్రామ సభల ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు డిప్యూటీ తహసీల్దార్ సరస్వతి, రెవెన్యూ సిబ్బందితో కలిసి తహసీల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాగ్గల్ గ్రామంలో 12 ఎకరాల్లోని 13మంది రైతులు తమ పొలాల కొలతల్లో తేడాలు ఉన్నాయని గ్రామ సభల్లో అర్జీలు ఇవ్వడంతో వాటిని పరిశీలించామన్నారు. సర్వేయర్లతో భూములను సర్వే చేశామని 12 మంది రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్వేయర్ అశోక్, గ్రామ సర్వేయర్లు నవీన్, హేమ చంద్ర, బీరప్ప, వీర్వోలు పుష్పలత,నాగభూషణ రావు ఉన్నారు.

బాలుర హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న నాయకులు

గోనెగండ్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలో బాలుర హాస్టల్‌ను ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయి ఉదయ్, గోనెగండ్ల మండల అధ్యక్ష, కార్యదర్శులు పవన్, రంగస్వామి డిమాండ్ చేశారు. శనివారం విద్యార్థి సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ వసతి దీవెన, విద్యా దీవెన బకాయిలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం, సంక్షేమ హాస్టళ్ల సమస్యలు మెస్ బిల్లుల పెంపు, జీవో ఏడు రద్దు, తల్లికి వందనం, యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న విజయవాడలో చేపట్టనున్న ధర్నా వాల్ పోస్టర్‌లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, ఓంకార్, రియాజ్, వినయ్, పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


ఐటీ మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ

గోనెగండ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని ఐటీ మంత్రి నారా లోకేశ్ సూచించినట్లు కురువ కురుబ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ తెలిపారు. శనివారం విజయవాడలో మంత్రి నారా లోకేశ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, కురువల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రామకృష్ణ అన్నారు.

దేవాలయాలకు స్వయంప్రతిపత్తి కల్పించాలి

మంత్రాలయం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి కల్గించి స్వయంప్రతిపత్తి కల్పించాలని, ఉత్తమ ధార్మిక వ్యవస్థ ఏర్పాటుకు చట్టసవరణ చేయాలని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు అన్నారు. హైందవ శంఖారావం జిల్లా కో కన్వీనర్, టీటీడీ ధర్మప్రచార మండలి సభ్యుడు నాయకంటి భీమారెడ్డి, పలువురు శనివారం పీఠాధిపతిని కలిసి హైందవశంఖారావం మహాసభకు ఆహ్వానించి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మాలను, సాంప్రదాయాలను, మఠాలను, పీఠాలను కాపాడాలన్నారు. ఇందు కోసం తన సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. హిందూవులంతా కలిసికట్టుగా పోరాటాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీటీడీ ధర్మప్రచార మండలి సభ్యులు సూర్యనారాయణ ఆచార్, భీమా లింగారెడ్డి, శ్రీరాముల యాదవ్, మురళీధర్, సోమిరెడ్డి, సీతారాముడు, గురు పాల్గొన్నారు.


హైదవ శంఖారావం పోస్టర్లను విడుదల చేస్తున్న పీఠాధిపతి


స్వర్ణ రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

శోభాయమానంగా ధాత్రి హోమం

కార్తీక పౌర్ణమి ముగింపు సందర్భంగా ధాత్రి హోమం శోభాయమానంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రాలయం అభయ ఆంజనేయస్వామి సన్నిధిలోని ఉసిరి, తులసి వనాల మధ్య సంస్థాన పూజ చేశారు. ధాత్రి హోమాల్లో దూప, దీప నైవేద్యాలు, సుగంధ ద్రవ్యాలు వేసి పీఠాధిపతి పూర్ణాహుతి చేశారు. ఉసిరి చెట్టుకింద పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు కనకాభిషేకం చేసి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం వన భోజనం నిర్వహించారు. కార్యక్రమంలో విద్వాన్‌రాజా ఎస్ గిరిరాజాచార్, మేనేజర్లు వెంకటేష్‌జోషి, శ్రీపతిఆచార్, ఐవీనరసింహమూర్తి, డీఎం ఆనందరావు, అనంత పురాణిక్, విజయేంద్రాచార్, రవికులకర్ణి, జేపీస్వామి, అనంతస్వామి పాల్గొన్నారు.

స్వర్ణ రథంపై విహరించిన ప్రహ్లాదరాయలు

రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శనివారం కార్తీక పాడ్యమి శుభదినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వర్ణ రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయులను అధిష్టించి ఆలయ ప్రాంగణ చుట్టూ ఊరేగించారు. అనంతరం ఉత్సవ మూర్తికి ఊంజలసేవ నిర్వహించారు.